ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 26, 2010

ENTERED

కాలం ఖాతాలో..
వీడ్కోలు వీక్షణం...

2011 హ్యాపీబర్త్‌డే

(2010 డిసెంబర్ 26 నుంచి 2011జనవరి 1 వరకు)

ఇ. భవిత
6సం॥,డిసెంబర్-2004
పద్మ-అప్పారావు
గుంటూరు

పి. శివచరణ్‌గౌడ్
2సం॥,డిసెంబర్-2008
నీలిమ-రాజయ్య
ముషీరాబాద్-హైదరాబాద్

ఎ.మున్నా(పొన్ను)
డిసెంబర్
కావ్య-శ్రీధర్
కురవి-వరంగల్

జి. ఆశ్రిత
6సం॥,డిసెంబర్-27
పద్మిని-శ్రీనివాస్
రాజోల్‌నగర్-హైదరాబాద్

టి. దీవక్
10సం॥,జనవరి-1
అనిత-వెంకటేశ్వరరావు
కేశవాపురం-ఖమ్మం

పి. ఆర్తి
6సం॥,జనవరి-1
సృజన-వెంకటేశ్వర్లు
సీతారామనగర్-గుంటూరు

జుబైరియా తబస్సుమ్
4సం॥,డిసెంబర్-2006
మల్లికాజైనబ్-సదీరుద్దీన్
మచిలీపట్నం-కృష్ణా

పి.తరుణ్
8సం॥,డిసెంబర్-29
ఉమ-రామచంద్రయ్య
బయ్యారం-ఖమ్మం

ఎ. వికాస్‌కుమార్
12సం॥,డిసెంబర్-28
చాయాలక్ష్మి
-రవికుమార్

అనస్ అహ్మద్
డిసెంబర్-26
సల్మా-రియాజ్ అహ్మద్
నవలాకులతోట-నెల్లూరు

జి. శ్రీకాంత్
డిసెంబర్-26
లక్ష్మమ్మ-సత్యనారాయణ
నందివనపర్తి-రంగారెడ్డి

రిషిత్‌ప్రణవ్
4సం॥,జనవరి-1
శారద-రాజశేఖర్
దోమకొండ-నిజామాబాద్

సల్మాన్ ఆదిల్
3సం॥,డిసెంబర్-28
అసీనా-అన్వర్
దోమల్‌గూడ-హైదరాబాద్

బి. సాయి వర్షిత
1సం॥,డిసెంబర్-31
భాగ్యలక్ష్మి-శ్రీనివాస్
నేరేడ్‌మెట్-సికింద్రాబాద్

మణికంఠ
డిసెంబర్
అన్నపూర్ణ-నాగేశ్వరరావు
రావులపాలెం-తూ॥గో॥

శ్రీలక్ష్మి
డిసెంబర్-31
నాగమణి-కొండయ్య
సువర్ణాపురం-ఖమ్మం

పి. అభిలాష్
2సం॥,డిసెంబర్-27
వినోద-పరశురాములు
పోతారెడ్డిపల్లి-మ॥నగర్

ఎన్.సాయి కుష్వంత్‌కుమార్
1సం॥,డిసెంబర్-31
జ్యోతి-వెంకటరమణ
గరివిడి-విజయనగరం



పి. సృజన్
1సం॥,డిసెంబర్-26
నీరజ-రాజ్‌కుమార్
ఎ.బి.నగర్-హైదరాబాద్

పి.భవాని
7సం॥,జనవరి-1
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
బల్లికుంట-ప్రకాశం

కె. భరత్
2సం॥,డిసెంబర్-2008
సుజాత-వెంకట్రావు
లక్ష్మీపోలవరం-తూ॥గో

ఎ.మురారి
1సం॥,డిసెంబర్-2009
సుజాత-అనిల్‌కుమార్
రికాబ్ గంజ్-హైదరాబాద్

ENTERED

మనలో మాట

ఇలా స్వాగతిద్దాం

వీడ్కోలు...స్వాగతం...

ఆహా! ఇవి రెండూ ఎంత గొప్ప సందర్భాలు?!

విచిత్రంగా ఒకటి వున్న చోట మరొకటి వుండదు. అలాంటిది రెండూ ఒకేసారి చేయాల్సి వస్తే! కూసింత ఉద్విగ్నంగానే వుంటుంది. అంతటి అపురూపమైన సందర్భం ఏడాదికోమారు వస్తుందంటే...ఊరుకుంటారా! వేడుకే కొందరికి. వాడుకే మరికొందరికి. డిసెంబర్ 31 సరిగ్గా అలాంటిదే. పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పి... కొత్త ఏడాదికి స్వాగతం పలికే రోజు. మరి నాలుగు రోజుల్లో దర్జాగా మన ముందుకు రాబోతోంది.

***

మీడియా ఏ సందర్భాన్ని వదలదు కదా! న్యూ ఇయర్ సందర్భంగా సరికొత్త కార్యక్రమాలు. కొంగొత్త రియాల్టీ షోలు. అర్ధరాత్రి వరకూ పోటాపోటీగా సాగుతాయి. పత్రికలు ఊరుకుంటాయా! తమదైన కొత్తదనాన్ని నింపుకోవడానికి ఆరాటపడతాయి. హోటళ్లు, సాంస్కృతిక ప్రదేశాలు సెలబ్రెటీలతో తళుక్కున మెరుస్తాయి. స్పెషల్ షోలతో కిక్కిరిసిపోతాయి. సెలబ్రెటీలు తమ ఆట, పాట, మాటలతో న్యూ ఇయర్‌ను ఆహ్వానిస్తారు. డబ్బు కొద్దీ వేడుక మరి.

***

గరీబులకో! అన్ని రోజుల్లా ఇదీ ఒక రోజు. ఎప్పటిలాగే వస్తుంది పోతుంది. డిసెంబర్ 31 అయినా... జనవరి 1 అయినా... ఏదైనా ఒకటే. అన్ని సందర్భాలలోనూ ఒకటే ఆలోచన. ఉల్లిపాయలు కొనాలంటే కళ్లనీళ్లు వస్తున్నాయ్. గ్యాసుబండ గుదిబండయ్యింది. పెట్రోలు వాతలు సలుపుతున్నాయి. రంగుమారిన ధాన్యం దైన్యంగా కల్లాల్లో పడివుంది. కొనే దిక్కులేదు. అక్కున చేర్చుకోవాల్సిన సర్కారు దిక్కులు చూస్తోంది. ఇన్నిటి మధ్య వీడ్కోలు...స్వాగతాలు...ఏం చేయగలడు?

***

డబ్బున్న మారాజులకు, బలాదూర్ రాయుళ్లకు డిసెంబర్ 31 రాత్రి విందులు...వినోదాలు! ఉత్కంఠలు..కేరింతలు..! పొంగిపొర్లే మందు బాటిళ్లు...పాటలు... డాన్సులు...స్టెప్పులు.. కేకులు... ఫోన్లలో శుభాకాంక్షలు... ఎస్సెమ్మెస్సులు... గ్రీటింగులు... ఛాటింగులు... వీధుల్లో సైలెన్సర్ లేని బళ్లమీద షికార్లు... అర్ధరాత్రి యాక్సిడెంట్లు...

ఎక్కడి నుంచి దూసుకొచ్చిందో ఈ సంస్కృతి మనల్ని పట్టుకొని పీడిస్తోంది. గత కొన్నేళ్లుగా రక్తం కళ్ల చూడకుండా నూతన సంవత్సరం ప్రవేశించడం లేదు. ఆరోజు మద్యం అమ్మకాలు పెరిగి మందు వ్యాపారులు, సర్కారు వారు ఖుషీ అయితే కావచ్చు. కానీ ప్రమాదం పాలైన యువకుల తల్లిదండ్రుల జీవితాలే చీకటిమయమైపోతున్నాయి. డబ్బులు, ప్రాణాలు పోగొట్టుకొనే ఈ దుష్ట సంస్కృతికి స్వస్తి చెబుదాం. బతుకును బాగుపర్చే కృతనిశ్చయాలతో కొత్త ఏడాదిని ఆహ్వానిద్దాం.

హ్యాపీ న్యూ ఇయర్.

★

ఈ సంచికలో....

టపా ... 2
తెలుసుకుందామా ... 3
కవిత్వమ్ ... 6
నవ్వుల్ పువ్వుల్ ... 7
సీరియల్ ... 8
సినిమా కబుర్లు ... 12
అట్టమీది కథ ... 14
కథ ... 18
కొత్త పుస్తకాలు ... 21
బాలనేస్తాలు ... 22
మాటలకోట ... 24

ఇంకా...

స్ఫూర్తి ... 4
నామ్‌చామ్‌స్కీ జిందాబాద్

ఈ పేజ్ ... 10
ఆన్‌లైన్లో డైరీ

రుచి ... 20
నోరూరించే పచ్చళ్లు



ఆలోచన కలిగించింది

నేడు సాంప్రదాయక క్షురకులు ఎదుర్కొంటున్న సమస్యలను వాటికి సాధ్యమయిన పరిష్కార మార్గాలను పరిశోధనాత్మకంగానూ విశ్లేషణాత్మకంగాను ఎస్.ఎస్.ఆర్. శాస్త్రిగారు వివరించిన తీరు ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తించే విధంగా వుంది. ఉత్తమ పుస్తక పఠనానికి కందుకూరి వీరేశలింగం గారు బాల్యంలో పడిన పాట్లు, ఆనాటి సామాజిక సంకుచిత కట్టుబాట్ల మధ్య వారు అభ్యుదయ భావజాలాన్ని సంతరించుకొన్న వైనం ఆశ్చర్యం గొలిపింది. శిఖా ఆకాష్‌గారి 'కవి సమ్మేళనం' కవిత హేతుబద్ధంగా, తార్కికంగా, థ్రిల్లింగ్‌గానూ ఉంది. 'ప్లాటినం మెరుపుల్' పేరుతో ప్లాటినం లోహపు ప్రాముఖ్యతను సశాస్త్రీయంగా, చారిత్రక సామాజిక నేపథ్యంలో వివరించిన ఇంపైన రీతి సంచికకే సార్ధకతను చేకూర్చింది. 'సాలెగూడు' కథ నేటి 'మైక్రో ఫైనాన్స్' కోరల్లో చిక్కుకున్న నిరుపేద స్త్రీల దయనీయ పరిస్థితిని ప్రతిబింబిస్తుంది. 'స్ఫూర్తి', 'మాటల కోట' చాలా చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

భైరి సత్యనారాయణ,
భౌతికశాస్త్రోపన్యాసకులు,
కొత్తగూడెం, ఖమ్మం జిల్లా.

అంతులేని మనీ మాయ

మేడమ్ సోనియా తలిస్తే ఏ పనైనా జరుగుతుంది. సంస్కరణ వాది కందుకూరి అభ్యుదయ వాది. వారి స్ఫూర్తి చదవదగినది. అంత పెద్ద చాక్లెట్టా! వంద మందికి ఈజీగా సరిపోతుంది. వాసుదేవ్‌సింగ్ మంచి కమ్యూనిస్టుగా దేశ సేవ చేశారు. చేస్తున్నారు. కాకి కథ సుఖాంతం కావడం బాగుంది. మనీ మాయ అంతులేనిది. ఈ ఆదివారం వంటకాల రుచులను మరొక వారానికి వాయిదా వేయడం కష్టం.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

చక్కని మాట

12-12-2010 ప్రజాశక్తి స్నేహ కవర్ స్టోరీ 'నయా సెలూన్లు.. అవే సవాళ్ళు' ఎంతో బాగుంది. వాస్తవాలను చక్కగా తెలియచేశారు. నాయీ బ్రాహ్మణుల గురించి, క్షౌరవృత్తిదారులపై చాలా చక్కని కథనం అందించారు. నేడు క్షౌరవృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి. పల్లెటూళ్లలో "మేర"ల పద్ధతి ఇంకా కొనసాగడం, పట్టణాలలో షాపుల ఏర్పాటులో రిలయన్స్ అడుగుపెట్టే సూచనలు కనబడటం ఆందోళనకరమైన అంశం. 20-30 రూపాయలతో పోయే కటింగ్ 200/-, 300/-లను చేరుకుంటుంది. మనిషి పుట్టినప్పట్నించి మరణించాక కూడా వీరి ప్రమేయం ప్రతిదశలోను ఉంటుంది. అయినప్పటికి కొన్ని గ్రామాల్లో సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేదు. ఏది ఏమైనా చాలా చక్కని కవర్ స్టోరీ అందించారు. మొదటి పేజీలో మనలో మాట 'ఏమిటీ ఆందోళనలు?' చాలా బాగుంది. కందుకూరికి స్ఫూర్తిని కలిగించిన 'వసు చరిత్ర' పుస్తక పరిచయం బాగుంది. బీహార్ ఎం.ఎల్.సి వాసుదేవ్ సింగ్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆయన నిజమైన ప్రజాప్రతినిధి.

మార్టూరు అజయ్‌కుమార్,
చిలకలూరి పేట, గుంటూరుజిల్లా.

కందుకూరి స్ఫూర్తి ఆచరణీయం

కందుకూరి వీరేశలింగం గారి స్వీయ చరిత్రము 1860-1870 అధ్యాయం అందరూ చదవదగినది. కందుకూరి జీవితం అందరికీ ఆదర్శం, ఆచరించదగినది. మూఢనమ్మకాలను పారదోలటానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి. సంఘ సంస్కరణ సమాజానికి అవసరం. కవర్ స్టోరీ నయా సెలూన్లు నేటి మార్పుకు సంకేతం. క్షౌరవృత్తిలో అనేక మార్పులు వస్తున్నాయి. కాలానుగుణంగా మార్పులు అనివార్యం. మహిళలు, పురుషులు భిన్నరకాల కేశాలంకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

టి.శ్రీరామ్మూర్తి,
గాజువాక, విశాఖ.

చదవవలసినవి

'నయా సెలూన్లు అవే సవాళ్ళు' విషయాలు చదవవలసినవి. క్షౌరకర్మ విధానాలు మారిపోయాయి. గెడ్డాలు గీయడం మొదలు తెల్లజుత్తుకు నల్లరంగు వేసే వరకు మార్పులు చోటుచేసుకొంటున్నాయి. యాత్రలలో మొక్కుబడికి తల నీలాలు ఇవ్వడం పరిపాటే. సెలూన్లలో రివాల్వింగ్ కుర్చీలు, అద్దాలు, విషయాలతో బాటు క్షౌరవృత్తి పుట్టుపూర్వోత్తరాలు, సమస్యలు... వివరించారు. బావుంది.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డి అన్నారం, హైదరాబాద్.

ఆసక్తిదాయకం

ప్రస్తుతం ఎంత వెతికినా కానరాని కామ్రేడ్ వాసుదేవ్ సింగ్ లాంటి వారు 50 సంవత్సరాల క్రితం ప్రతిచోటా కనిపించే త్యాగధనుల నిజమైన వారసులు. మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలని లీషావ్‌చీ రాశారో వాసుదేవ్‌సింగ్ అచ్చం అలాగే జీవిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల పింఛను తిరస్కరించటం, కుమారునిపై ప్రేమ వున్నా సిద్ధాంతానికి కట్టుబడి అతను కోరిన సహాయం చెయ్య నిరాకరించటం వారిలోని అత్యుత్తమ లక్షణాలు. పార్టీ సభ్యత్వం తీసుకున్నంత మాత్రానే కమ్యూనిస్టుకారని చెప్పక చెప్పినట్టుంది. ఇప్పుడు ఇలా మంచి కమ్యూనిస్టుగా వున్నవారు ఇంకా వున్నారు. అలాంటి మంచి రోజులు మరలా పార్టీకి ఎప్పుడు వస్తాయా అని ఆందోళన చెందనివారు లేరు. మంచి మార్పు రాక తప్పదు. కందుకూరి వీరేశలింగం గారు 'వసు చరిత్ర' గురించి, వారి చదువు మీద వున్న ఆసక్తిని గూర్చి చర్చించిన భాగము ఆయన స్వీయ చరిత్ర నుంచి ఇచ్చిన భాగం చాలా ఆసక్తిదాయకంగా వుంది. నిజంగా స్ఫూర్తిలోనే ఇది గొప్ప భాగంగా భావిస్తున్నాను.

మురళీధర్, విజయవాడ.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

తెలుసుకుందాం...

మసాలా దినుసులు దేశాలనే కలిపాయంటే నమ్మబుద్ధి కాదు. వ్యాపార నిమిత్తం ఓడల్లో సుగంధద్రవ్యాలను, దినుసులను నింపుకొని వెళ్లేవారు. వాటిని అక్కడ అమ్ముకొని తిరిగి స్వదేశం చేరుకొనేవారు. అయితే పనిలో పనిగా అక్కడ లభించే దినుసులను తిరిగి ఓడల్లో నింపుకొచ్చేవారు. వాటిని ఇక్కడ అమ్మేవారు. అలా దినుసులు దేశాలనే కలిపాయి. అయితే దినుసులు ఎంత ముఖ్యమో...ప్రాణాలకు తెగించి ఓడల్లో సరకు నింపుకొని ప్రయాణం చేసిన వారూ అంతే ముఖ్యం. వారే కనుక ఆ సాహసకృత్యాలు చేసి వుండకపోతే మనకు ఆయా దేశాలు...ఆయా దినుసులు తెలిసేవే కావు. ఉదాహరణకు వాస్కోడిగామా ప్రయాణం ప్రపంచ చరిత్రనే మార్చేసింది. కొలంబస్ అమెరికానే కనిపెట్టాడు. ఆ వివరాలు...

దేశాలను కలిపిన దినుసులు

వెనిస్ నగరానికి చెందినవాడు మార్కోపోలో (1252-1324). ఈయన గొప్ప వ్యాపారి. ఈయనకు సాహసకృత్యాలంటే మహా ఇష్టం. 1271-95 మధ్య ఆయన ఆసియాకు ప్రయాణం కట్టాడు. 17 ఏళ్లపాటు చైనాలో ఉన్నాడు. తన ప్రయాణం అనుభవాలతో ఆయన రాసిన పుస్తకం గొప్ప ఖ్యాతి సంపాదించిపెట్టింది. దాంతోపాటు డబ్బు కూడా వచ్చిపడిందనుకోండి.

ఎలిజబెత్ కాలానికి చెందినవాడు ఫ్రాన్సిస్ డ్రేక్ (1540-1596). బ్రిటిష్ నావికుల్లో అత్యంత ప్రఖ్యాతుడు. 1577 నుంచి 1580 మధ్య ఆయన సముద్రంపై భూమిని చుట్టి వచ్చాడు. 1580లో సుగంధద్రవ్యాలతో నిండిన నౌకను ఆయన ప్లైమౌత్ హార్బర్‌లో ఆపినప్పుడు బ్రిటన్ డ్రేక్‌కు నీరాజనాలు పలికింది.

వాస్కోడిగామా (1460-1524) పోర్చుగీసు నావికుడు. 1497 నుంచి 1524 వరకు మూడుసార్లు ఇండియా వచ్చి వెళ్ళాడు. గుడ్ హోప్‌ను చుట్టి ఇండియా తీరాన్ని మొదటిసారిగా తాకిన వాస్కోడిగామా యాత్ర పోర్చుగల్‌ను కొంతకాలం పాటు ప్రపంచశక్తిగా నిలపగలిగింది. నిజానికి వాస్కోడిగామా ప్రయాణం వలస పాలన ద్వారా ప్రపంచ చరిత్రనే మార్చి వేసింది.

ఫెర్డినాండ్ మాజిలాన్ (1480-1521) పోర్చుగీసు సాహసికుడు భూమిని చుట్టి వచ్చిన మొదటి ప్రయాణం మొదలు పెట్టి దక్షిణ అమెరికా ఖండాన్ని చుట్టి ముందుకు వెళ్ళాడు. పసిఫిక్ మహాసముద్రాన్ని దాటాడు. మాజిలాన్ జలసంధికి ఆయన వల్లనే ఆ పేరు వచ్చింది.

క్రిస్టఫర్ కొలంబస్ (1451-1506)కు వచ్చినంత ఖ్యాతి ప్రపంచంలో ఏ అన్వేషకుడికీ రాలేదు. నూతన ప్రపంచం (అమెరికా) కనిపెట్టింది ఆయనే. అయితే కొలంబస్ అనుకున్నదొకటి జరిగింది. ఒకటి. ఈస్ట్ ఇండియా దీవులకు సముద్రమార్గం కనిపెట్టేందుకు బయలుదేరి అమెరికా తీరంలో తేలాడు. లక్ష్యం సాధించలేకపోయినా బోలెడు బంగారం, కొత్త రకాల సుగంధ ద్రవ్యాలు దొరికే ప్రాంతాలను కనిపెట్టాడు.

అల్లం. మనం వంటలో ఎక్కువగా వాడుతుంటాం. ఇది 'జింజిబర్ అఫీషియనల్ అమే' అనే మొక్క వేరంటే నమ్ముతారా! చైనా ఆగ్నేయ ప్రాంతం నుంచి క్రమంగా ఇది చాలా దేశాలకు విస్తరించింది. దీనిలో ఔషధ గుణాలు కూడా ఉన్నాయి.

చట్నీల్లో జీలకర్ర తగలంది రుచించదు మనకు. జీలకర్రగా మనకు తెలిసిన 'రాదినునుక్యుమినం ఫైమినం' అనే చెట్టు విత్తనాలు. తూర్పు మధ్యధరా ప్రాంతం నుంచి ఇది వచ్చింది.

పానకం అనగానే మనకు స్ఫురించేవి మిరియాలు. వీటిని 'ఆల్‌స్పైను జమైగా' అని కూడా అంటారు. పిమెంటా డయోకా అనే చెట్ల కాయలే ఈ మసాలా దినుసు.

పిల్లలకు తలంటు పోయాలంటే సాంబ్రాణి కావాల్సిందే. మరి సాంబ్రాణి ధూపం వేస్తేనే కదా స్నానం పూర్తయినట్టు. 'బోస్వెల్లియాస్కారా' అనే చెట్టు ఒమన్ ఎడారి భూముల్లో మాత్రమే పెరిగేది. ఆ చెట్టు నుంచి వచ్చే బంకను ఎండబెడితే అదే సాంబ్రాణి.

దాల్చిన చెక్క పుట్టిల్లు శ్రీలంక. 'సిన్నమోనం శైలాంసియం' అనే చెట్టు బెరడు ఇది. ఒకప్పుడు యూరప్‌లో దానికి నమ్మశక్యంకాని ఎక్కువ ధర పలికేది.

క్రీ.పూ. 400 ప్రాంతంలో మిరియాలు వ్యాపారం మొదలయ్యేంత వరకూ యూరప్‌లో ఆవాలదే రాజ్యం. తెల్ల ఆవాలకు బాగా గిరాకీ ఉండడంతో మధ్యయుగం కాలంలో ఆవాలసాగు ఇండియా, చైనాలకు విస్తరించింది.

అతిమధురం (లికో రైస్) అనే ఈ ఔషధాన్ని 2000 ఏళ్ల క్రితం నుంచి ఇండియా, చైనా, యూరప్ దేశాల్లో వాడుతున్నారు. గ్లైసిరైజా గ్లాబ్రా అనే చెట్టు వేరు నుంచి దీనిని తీస్తారు.

★

స్ఫూర్తి

అమెరికా సోవియట్‌లు రెండింటి ప్రచారకాండ ఉధృతంగా వున్నప్పుడు పెరిగినదాన్ని (అవి రెండు ఇంచుమించుగా ఒకదాన్ని మరొకటి తటస్థీకరిస్తుండేవి). అలాంటి నాకు చామ్‌స్కీని చదివినప్పుడు - సాక్ష్యాలు మోహరించడం, దాని పరిణామం, అది నిర్విరామంగా వెలువడుతుండడం, ఇదంతా కూడా - ఎలా చెప్పను? ఒక విధంగా ఉన్మాదం అనిపించింది. ఆయన సేకరించిన దానిలో నాలుగో వంతు చూపించినా నేను ఒప్పేసుకుని వుండేదాన్ని, ఆయన ఎందుకని అంతగా కష్టపడుతున్నాడని అనుకునేదాన్ని. అయితే ఇప్పుడు నాకు అర్థమవుతున్నది. చామ్‌స్కీ కృషి విస్తృతి, ప్రగాఢత అన్నవి ఆయన ఏ యుద్ధ యంత్రానికి వ్యతిరేకంగానైతే పోరాడుతున్నాడో దాని పరిధికి, విస్తృతికి, నిరంతరాయ స్వభావానికి సరిపోతాయి.

నా పుస్తకాల అల్మైరాలోని మూడవ అరలో వసించే వండ్రంగి పురుగులాంటివాడు అయన. అది చెక్కను తొలిచేయడం దాన్ని పొడిపొడిగా మార్చడం నేను వింటూనే వుంటాను. ఆయన సాహిత్యంతో విభేదిస్తున్నట్టు... అందువల్లనే దానికి ఆశ్రయం కల్పిస్తున్న వస్తువునే ధ్వంసం చేయదలచినట్టు ప్రవర్తిస్తుంది. దాన్ని నేను చాంప్‌స్కీ అంటుంటాను. అమెరికాలో పనిచేస్తున్న అమెరికన్‌గా అమెరికన్లను తను చెప్పే విషయాలపై ఒప్పించడం అన్నది నిజంగా పెద్ద అడవి గుండా గుహ తొలుస్తూ పోవడం వంటిదే. ఒక బ్రహ్మాండమైన పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న కొద్దిమంది వ్యక్తుల సమూహంలో చామ్‌స్కీ ఒకరు. అందువల్లనే ఆయన ప్రతిభావంతుడుగా గాక వీరుడుగా మిగులుతున్నాడు.

- అరుంధతీ రాయ్

నామ్‌చామ్‌స్కీ జిందాబాద్

న్యూఢిల్లీలో ఉన్న మా ఇంట్లో కూర్చొని ఒక అమెరికన్ టీవీ ఛానల్ ప్రోమోను చూస్తున్నాను (మేము నివేదిస్తాము, మీరు నిర్ణయిస్తారు అనే కార్యక్రమం). అప్పుడు నామ్‌చామ్‌స్కీ తమాషాగా విరిగిపోయిన పళ్లతో నవ్వుతున్న దృశ్యం ఊహించుకున్నాను.

వాటి సిద్ధాంతాలేమైనా సరే నిరంకుశ ప్రభుత్వాలు ప్రచారం కోసం ప్రసార సాధనాలను వాడుకుంటాయన్న సంగతి అందరికి తెలుసు. కానీ ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలుండే 'స్వేచ్ఛా ప్రపంచం' సంగతేమిటి? నామ్‌చామ్‌స్కీ ఆయనతోటి మీడియా విశ్లేషకుల పుణ్యాన ఈ రోజున మనలాంటి వేలాది మందికి - బహుశా లక్షలాది మందికి కూడా దాదాపు రూఢీ అయిపోయింది. ఏమంటే స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్యాలలో మిగిలిన మార్కెట్ ఉత్పత్తులలాగే ప్రజాభిప్రాయం కూడా సృష్టించబడుతుంది. సబ్బులు, స్విచ్‌లు, బ్రెడ్ ముక్కల్లాగే అది కూడా తయారు చేయబడుతుందని మనకిప్పుడు తెలిసిపోయింది. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వాక్‌స్వాతంత్ర్యం ఉంటే ఉండవచ్చు. కానీ ఆ స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకోవడానికి అవసరమైన భావావరణం మాత్రం మననుంచి కొల్లగొట్టబడింది. వేలం పాటలో దాన్ని భారీ పాటగాళ్ళు గెల్చుకున్నారు. నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం అన్నది కేవలం (కొద్దిమందికి) పెట్టుబడి పోగుపడడానికి సంబంధించినది మాత్రమే కాదు. అది (కొద్దిమందికి) అధికారం, (కొద్దిమందికి) స్వాతంత్ర్యం కూడా పోగుపడేలా చేస్తుంది. మిగిలిన ప్రపంచపు పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. అంటే ఈ నయా ఉదారవాద పాలనా వ్యవస్థ పరిధి వెలుపలి వారికి పెట్టుబడి, అధికారం, స్వాతంత్ర్యం అన్నీ హరించివేయబడతాయి. 'స్వేచ్ఛా' మార్కెట్‌లో మిగిలిన అన్నిటి లాగే వాక్ స్వేచ్ఛ - న్యాయం, మానవ హక్కులు, మంచినీరు, పరిశుద్ధమైన గాలి - వగైరాలలాగే ఒక సరుకై పోయింది. అది

చెల్లించగలిగినవారికే లభిస్తుంది. సహజంగా వాక్ స్వాతంత్ర్యం కొనుక్కోగలిగినవారు దాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణమైన ఉత్పత్తిగా మలచుకుంటారు. అలాంటి ప్రజాభిప్రాయాన్ని సృష్టిస్తారు (తమకు ఉపయోగపడే సమాచారమే అందిస్తారు). ఇది ఆచరణలో ఎలా జరుగుతుందో ఖచ్చితంగా చెప్పడమే నామ్‌చామ్‌స్కీ అనేక రాజకీయ రచనల ప్రధానాంశం.

ప్రపంచానికి నామ్‌చామ్‌స్కీ చేసిన అతి గొప్ప మేలు ఏమిటని నన్నెవరైనా అడగొచ్చు. చాలా అందమైన, ఆకర్షణీయమైన స్వాతంత్ర్యం అన్న పదం వెనుక వున్న వికృతమైన, మోసపూరితమైన నిర్దాక్షిణ్య ప్రపంచాన్ని బట్టబయలు చేయడమే ఆయన చేసిన మేలు అని చెప్తాను. ఆయన ఈ విషయాన్ని హేతుబద్ధంగానూ, అనుభావవాదంతోనూ పూర్తి చేశారు. తన వాదనకు మద్దతుగా ఆయన కుమ్మరించే సాక్ష్యం తిరుగులేనిది. నిజంగా భయంకరమైనది. చామ్‌స్కీ పద్ధతికి ప్రాతిపదిక సిద్ధాంతం కాదు. ప్రగాఢమైన రాజకీయం. అధికారాన్ని స్వతహాగానే విశ్వసించని ఒక అరాచకవాదిలా ఆయన తన యాత్ర ప్రారంభిస్తాడు. అమెరికా పాలక వ్యవస్థలో మనతో పర్యటన చేయిస్తాడు. కళ్ళు మిరుమిట్లు గొలిపే ఆ అధికార సౌధపు గుట్టుమట్టులు చూపిస్తాడు. బడా వాణిజ్యానికి - ప్రజాభిప్రాయాన్ని మాయ చేయడానికి ప్రభుత్వానికి మధ్య గల బ్రహ్మముడిని విడమరిచి వివరిస్తాడు.

స్వేచ్ఛా మార్కెట్, స్వేచ్ఛా ప్రపంచం, వాక్ స్వాతంత్ర్యం వంటి మాటలకు - నిజమైన స్వాతంత్ర్యానికి దాదాపుగా గాని బొత్తిగా గాని సంబంధమే లేదని చామ్‌స్కీ నిరూపిస్తాడు. అమెరికా ప్రభుత్వం ప్రకటించే అనేకానేక స్వాతంత్రాలలో హత్యలు, నిర్మూలనలు, ఇతర దేశాల ప్రజలపై పెత్తనాలు చేసే స్వాతంత్ర్యాలు ఉంటాయని చెప్తాడు. ప్రపంచవ్యాపితంగా నిరంకుశులకు, నియంతలకు పెట్టుబడి పెట్టి నడిపించే స్వాతంత్ర్యం అందులో ఉందంటాడు. టెర్రరిస్టులకు శిక్షణ, ఆయుధాలు, ఆశ్రయం కల్పించే స్వాతంత్ర్యం అది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసే స్వాతంత్ర్యం. రసాయన, జీవ, అణు ఆయుధాలు గుట్ట పోసుకుని సామూహిక మారణహోమం సాగించే స్వాతంత్ర్యం. తమతో ఏకీభవించని ఏ దేశంపైనైనా యుద్ధం చేసే స్వాతంత్ర్యం. అన్నిటికన్నా

దారుణమైనదేమంటే న్యాయం పేరుతో, ధర్మబద్ధత పేరుతో, స్వాతంత్ర్యం పేరుతో మానవాళికి వ్యతిరేకంగా నేరాలు చేసే స్వాతంత్ర్యం.

అంగీకార సృష్టి అన్న వ్యాసంలో అమెరికా స్థాపన గురించి చామ్‌స్కీ ఇలా రాస్తాడు :

కొద్ది వారాల కిందట ధన్యవాద సమర్పణ శెలవు రోజున నేను కొంతమంది స్నేహితులతో, కుటుంబంతో కలసి నేషనల్ పార్కులో నడుస్తున్నాను. మేమొక సమాధి దాటిపోతున్నాము. ఆ సమాధి ఫలకంపై ఇలా రాసి వుంది : "ఇక్కడ వామ్‌పనోద్ అనే ఇండియన్ మహిళ భౌతికకాయం వుంది. ఆమె కుటుంబం, తెగ తమను, తమ భూమిని ఉద్భవించి వృద్ధి చెందనున్న ఈ గొప్ప దేశానికి అర్పించారు."

స్థానిక ప్రజానీకం ఒక ఉదాత్త ప్రయోజనానికి తమను, తమ భూములను అర్పించిన తీరును ఖచ్చితంగా చెప్పవలసిన పద్ధతి ఇది కాదు. వాస్తవానికి ఆ జనాన్ని ఊచకోత కోశారు. నిర్మూలించారు. తరిమికొట్టారు. మానవ చరిత్రలో సాగిన మారణహోమాలలోని అతి పెద్ద ఘటన అది.... దాన్నే మనం ప్రతి అక్టోబర్‌లో పండుగ చేసుకుని కొలంబస్ డేగా గౌరవిస్తాము. అసలు కొలంబసే ఒక పెద్ద నరహంతకుడు. వందల మంది అమెరికన్ పౌరులు సద్బుద్ధి కలిగిన సంస్కారవంతులు. ఆ సమాధి రాయి పక్కన నిలబడి ఎల్లప్పుడూ దాన్ని చదువుతారు. బహుశా ఎలాంటి స్పందన లేకుండా. స్థానిక ప్రజలు చేసిన త్యాగాలకు ఎట్టకేలకు కొంతైనా సముచిత గుర్తింపు ఇస్తున్నామన్న సంతృప్తి కూడా వారికి వుంటే వుండవచ్చు.... అయితే వారేగనుక (నాజీ హింసా శిబిరాలు నడచిన) ఆష్విచ్ లేదా డాచూ వెళ్తే... "ఇక్కడ ఒక మహిళ శాశ్వతంగా నిద్రిస్తోంది. ఆమె ఒక యూదురాలు. ఆమె కుటుంబం, ప్రజలు ఉద్భవించి వర్ధిల్లబోయే ఒక మహత్తర దేశానికి తమను తాము అర్పించుకున్నారు" అని రాసి వున్న సమాధి ఫలకం చూస్తారు. బహుశా ఇందుకు భిన్నంగా ప్రతిస్పందిస్తారు.

"ఫర్ రీజన్స్ ఆఫ్ స్టేట్" (రాజ్యం కోసం) అన్న చామ్‌స్కీ పుస్తకంలో చాలా వ్యాసాలు దక్షిణ వియత్నాంలో ఉత్తర వియత్నాంలో లావోస్ కంబోడియాలలో అమెరికా దురాక్రమణ గురించే వుంటాయి. అది పన్నెండేళ్లకు పైగా సాగిన యుద్ధం. నలభై ఎనిమిది వేలమంది అమెరికన్ సైనికులు, దాదాపు ఇరవై లక్షలమంది వియత్నాం, లావోస్ కంబోడియా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా యాభై లక్షలమంది సైనికులను మోహరించింది. దాదాపు అరవై లక్షల టన్నుల బాంబులు కురిపించింది. అయినా సరే, మీరు గనక చాలా హాలీవుడ్ సినిమాలు చూస్తే అమెరికా ఆ యుద్ధంలో ఓడిపోయిందనే అనుకోరు.

1984లో చామ్‌స్కీ దిగ్భ్రాంతికరమైన రీతిలో ఇలా వెల్లడించారు :

'గత ఇరవై ఏళ్లుగా నేను ప్రధాన పత్రికలలో గాని పండిత రచనలలో గాని దక్షిణ వియత్నాంలో 1962లో (లేక మరెప్పుడైనా) అమెరికా ఆక్రమణ గురించి లేదా దాడి గురించి లేదా ఇండోచైనాలో అమెరికా దురాక్రమణ గురించి ఏమైనా ప్రస్తావన కనిపిస్తుందా అని వేయికళ్లతో గాలిస్తున్నాను. కాని నా ప్రయత్నం ఫలించలేదు. చరిత్రలో అలాంటి ఘటనే లేదు. అందుకు బదులుగా బయిట (వియత్నాం నుంచి) వారైన టెర్రరిస్టుల బారినుంచి దక్షిణ వియత్నాం పరిరక్షణకు అమెరికా వెళ్ళినట్లు మాత్రమే వుంటుంధి.'

కనక చరిత్రలో అలాంటి ఘటనే లేదు! ఫర్ రీజన్స్ ఆఫ్ స్టేట్ అన్న పుస్తకంలో కీలక వ్యాసం 'చామ్‌స్కీ' 'మెంటాలిటీ ఆఫ్ ద బ్యాక్‌రూం బాయ్స్'. దానిలో ఆయన పెంటగాన్ పత్రాలకు అత్యంత సరళమైన, సవిస్తరమైన విశ్లేషణ అందించాడు. 'ఆ పత్రాలు అంతర్జాతీయ వ్యవహారాలలో బలప్రయోగానికి పాల్పడే కుట్రకు లిఖిత పూర్వక సాక్ష్యం' అని పేర్కొన్నారు. ఇక్కడ కూడా చామ్‌స్కీ ఉత్తర వియత్నాంపై బాంబు దాడి పెంటగాన్ పత్రాలలో వివరంగా చర్చించబడిన వాస్తవాన్ని గమనంలోకి తీసుకుంటాడు. దక్షిణ వియత్నాం ఆక్రమణ మంచిచెడ్డలను గురించి కనీస ప్రస్తావన కూడా నోచుకోలేదని కూడా ఆయన చెబుతాడు.

పొరలు పొరలుగా చామ్‌స్కీ అమెరికా ప్రభుత్వాధికారుల నిర్ణయ క్రమాన్ని చీల్చిచెండాడాడు. అమెరికా యుద్ధయంత్రం ఎంత కరుడుగట్టిన రాతిగుండెతో వ్యవహరిస్తుందో తేటతెల్లం చేశాడు. అది యుద్ధ వాస్తవాలను బొత్తిగా చలించదు. సిద్ధాంతంతో దాని కళ్లు మూసుకుపోయాయి. లక్షోపలక్షలమంది మానవులను నిర్మూలించేందుకు అది సంసిద్ధంగా వుంది. పౌరులు, సైనికులు, మహిళలు, పిల్లలు, గ్రామాలు మొత్తం నగరాలు, పర్యావరణ వ్యవస్థలు వీటన్నిటినీ తుడిచిపెట్టేందుకు అది సిద్ధంగా వుంది.

అమెరికా సోవియట్‌లు రెండింటి ప్రచారకాండ ఉధృతంగా వున్నప్పుడు పెరిగినదాన్ని (అవి రెండు ఇంచుమించుగా ఒకదాన్ని మరొకటి తటస్థీకరిస్తుండేవి). అలాటి నాకు చామ్‌స్కీని చదివినప్పుడు - సాక్ష్యాలు మోహరించడం, దాని పరిణామం, అది నిర్విరామంగా వెలువడుతుండడం, ఇదంతా కూడా - ఎలా చెప్పను? ఒక విధంగా ఉన్మాదం అనిపించింది. ఆయన సేకరించిన దానిలో నాలుగో వంతు చూపించినా నేను ఒప్పేసుకుని వుండేదాన్ని. ఆయన ఎందుకని అంతగా కష్టపడుతున్నాడని అనుకునేదాన్ని. అయితే ఇప్పుడు నాకు అర్థమవుతున్నది. చామ్‌స్కీ కృషి విస్తృతి, ప్రగాఢత అన్నవి ఆయన ఏ యుద్ధ యంత్రానికి వ్యతిరేకంగానైతే పోరాడుతున్నాడో దాని పరిధికి, విస్తృతికి, నిరంతరాయ స్వభావానికి సరిపోతాయి. నా పుస్తకాల అల్మెరాలోని మూడవ అరలో వసించే వండ్రంగి పురుగులాంటివాడు ఆయన. అది చెక్కను తొలిచేయడం దాన్ని పొడిపొడిగా మార్చడం నేను వింటూనే వుంటాను.

ఆయన సాహిత్యంతో విభేదిస్తున్నట్టు అందువల్లనే దానికి ఆశ్రయం కల్పిస్తున్న వస్తువునే ధ్వంసం చేయదలచినట్టు ప్రవర్తిస్తుంది. దాన్ని నేను చామ్‌స్కీ అంటుంటాను. అమెరికాలో పనిచేస్తున్న అమెరికన్‌గా అమెరికన్లను తను చెప్పే విషయాలపై ఒప్పించడం అన్నది నిజంగా పెద్ద అడవి గుండా గుహ తొలుస్తూ పోవడం వంటిదే. ఒక బ్రహ్మాండమైన పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న కొద్దిమంది వ్యక్తుల సమూహంలో చామ్‌స్కీ ఒకరు. అందువల్లనే ఆయన ప్రతిభావంతుడుగా గాక వీరుడుగా మిగులుతున్నాడు.

కొన్నాళ్ల కిందట జేమ్స్‌పెక్‌కు ఇచ్చిన హృద్యమైన ఇంటర్వ్యూలో చామ్‌స్కీ హిరోషిమా ఘట్టాన్ని గురించిన తన జ్ఞాపకాన్ని ఇలా చెప్పాడు : అప్పుడు ఆయనకు పదహారేళ్లట : నాకు ఆ రోజు బాగా జ్ఞాపకముంది. దాన్ని గురించి నేను ఎవరితోనూ మాట్లాడలేదు. ఎవరూ లేరు. నేను ఒక్కన్నే నడిచాను. అది వేసవి శిబిరం. దాన్ని గురించి వినగానే నేను అడవులలోకి వెళ్లి అక్కడ రెండు గంటలపాటు ఒంటరిగా గడిపి తిరిగి వచ్చాను. దాని గురించి నేనెప్పుడూ ఎవరితోనూ మాట్లాడలేదు. ఎవరి ప్రతిస్పందననూ అర్థం చేసుకోలేదు. నేను పూర్తిగా వంటరినైపోయాననిపించింది.

ఆ ఏకాకితనమే మనకాలపు ఒకానొక మహా మహా మేధావిని, ప్రగతిశీల ప్రజా చింతనాపరుణ్ని రూపొందించింది. అమెరికా సామ్రాజ్యంపై సూర్యుడు అస్తమించినప్పుడు అప్పుడు నామ్ చామ్‌స్కీ కృషి నిలుస్తుంది - అది జరిగితీరుతుంది. జరగాలి - ఒకానొక నిర్దాక్షిణ్యమైన, కుటిలత నిండిన సామ్రాజ్యాన్ని నిబ్బరంగా నిగూఢంగా వేలెత్తి చూపిస్తుంది. తనదే ధర్మమని విర్రవీగి తను కూలదోసిన ప్రభుత్వాలలాగే కపటంగా ప్రవర్తించిన సామ్రాజ్యాన్ని ఎండగడుతుంది. (తేడా అంతా ఏమంటే దాని దగ్గర సాంకేతిక పరిజ్ఞానం వుండటం. దాని సహాయంతో అది ప్రపంచ చరిత్రలోనే ఎరుగని వినాశాన్నీ, మానవజాతి వూహించశక్యం గాని విధ్వంసాన్నీ తీసుకురాగలుగుతుంది).

ఒక వేటపోతులా - ఎవరికి తెలుసు. రేపు కాబోయే బలిపశువులా వుండే నేను రోజుకొక్కసారైనా అనుకుంటూ వుంటాను - చామ్‌స్కీ జిందాబాద్..

(నామ్ చామ్‌స్కీ రాసిన "ఫర్ రీజన్స్ ఆఫ్ స్టేట్" అన్న పుస్తకానికి రాసిన ముందుమాట నుంచి.. సామ్రాజ్యవాదం ప్రస్తుత రూపాన్ని ఎండగట్టడంలో చామ్‌స్కీ పాత్రను వివరిస్తున్నందునే ఈ పునర్ముద్రణ)

★

దశాబ్దాల వెనక

గడిచిపోయిన కాలం
ఎంత అందమైనదో
చెద పురుగులు తినేసిన
క్యాలండర్‌లోని సంఖ్యలు
ఎంత అపురూపమైనవో
ప్రస్తుతం నా దినచర్యతో
పెనవేసుకుపోయిన ఈ పరిసరాలు
నా జననానికి ముందు ఎలా ఉండేవో
ఒక్కసారి చూడాలని ఉంది
కానీ...ప్చ్!! వీలు కాదు
తెల్లవారుజామునే గాజులబత్తుని కూనిరాగం
ఊరిని తియ్యగా నిద్రలేపేదట
ఇప్పుడు అలారం టోన్ అదరగొడుతోంది
నేడు పూడ్చిపెట్టబడిన మా చేదబావి
ఒకప్పుడు మా వీధి దాహం తీర్చిందట
ప్రతి ఇంటిపై కప్పు దూలానికి
పిట్టగూడు చెక్కించేవారట
పిచ్చుకలు ఇంట్లోకి వచ్చి తిరిగేవట
ఇప్పుడైతే కాకులు కూడా
కనుమరుగైపోతున్నాయి
మిట్టమధ్యాహ్నం ఇంటిముందు
వేపచెట్టు నీడలో నులకమంచంపై
ముసలివాళ్లు కునుకు తీసేవారట
ఇప్పుడు ఇంటి ముందు చెట్లూ లేవు
నులక మంచాలు అంతకన్నా లేవు
పెంటకుప్ప మీద పెరిగిన బంతి మొక్కలు
ఏ తోటమాలి తోడు లేకున్నా
లెక్కలేనన్ని ముద్ద బంతుల్ని పూయించేవట



పొలం గట్టు మీద గడ్డి పొదల్లో
కుందేళ్లు కాపురాలు చేసేవట
ఇప్పుడు శిథిలమైన మా వీధి అరుగు
ఊరి తగాదాలు తీర్చేదట
పాతకాలానికి ప్రతినిధి లాంటి
మా తాతయ్య చెబుతుంటే
చందమామ పుస్తకంలో బొమ్మలు గీసే
చిత్రకారుడిలా కనిపిస్తాడు
అపారమైన దృశ్యసంపదను
శిథిలం చేసి
పట్నానికి వలస వచ్చింది కాలం
దశాబ్దాల తెర వెనక బంధీ అయిన
సుందరమైన తైలవర్ణ చిత్రమే
గీతం!
మా స్టోర్ రూమ్‌లో మూలుగుతున్న పాత చెక్క
బీరువా
ఎన్ని పురాతన భావాలను
తనలో దాచుకుందో!
సజ్జె మీద బోర్లించిన ఇత్తడి బిందె
ఎంతమంది గొంతులు తడిపిందో
ఇప్పుడు తుప్పుపట్టి పోతున్న
పాతాళ గంగ
ఎన్ని దశాబ్దాల దాహార్తిని
తనలో దాచుకుందో!
చెబితే వినటమే కానీ
చూసే వీలు లేదు కదా!

-సోమిశెట్టి వేణుగోపాల్

కవిత్వమ్

నిట్టూర్పు

కర్షక వీరుల కాయంతో
నరాల బిగువు నశించినా
చేతుల సత్తువ సన్నగిల్లినా
కూటి కోసం కూలికెళ్లి
విరామ మెరుగక శ్రమించి
ఆసామిచ్చిన కూలి తీసుకుని
సరుకుల కోసం సంతకెళితే
అందరాని రేట్లతో సగం కడుపులు
కూడ నింపలేని సరుకులతో
దిక్కుతోచక దారి కానక
గంపెడు సంతానానికి గుక్కెడు
గంజినీళ్లు కూడా పోయలేక
అశ్రువులతో నిండిన నయనాలకు
బువ్వలేని బొచ్చలే కనిపిస్తుంటే
ముద్దకూడ దూరమైపోయి
ఆకలేసిన కేకలతో అలసిపోయి
అలసిన కనులు ఏమీ కనలేక
మిణుకు మిణుకు చూపులు చూసి
దిగులు పడుతూ దీనంగా చూస్తూ

చిమ్మ చీకటి కమ్ముకొస్తుంటే
నరనరాల వేదనలతో అలమటిస్తూ
నిరుత్సాహంతో ఏమీ చేయలేక
బక్కచిక్కి బిక్కచచ్చి బోరుమంటూ
వెక్కి వెక్కి ఏడుస్తున్న పిల్లల ఏడ్పులతో
జీవిత భీకర ఘోషలతో
నిట్టూర్పులతో నిష్ఠూరాలతో
హా హా కారాలు ఆర్తనాదాలతో
సుఖంలేక బతుకు వ్యధతో
ఆనందం అనేది ఏనాడు ఎరుగక
పందుల్లాగా పాచి పెంటతో ఎరుగక
పందుల్లాగా పాచిపెంటతో పొర్లాడుతూ
భయంకర నరకంలో కొట్టాడుతూ
అపస్వరాల చావుబతుకులతో
నిరాశ నిస్పృహలతో పరమార్థంలేక
బతుకులీడుస్తున్న మా బతుకులు
ఏమి సాధించను ఏముద్ధరించను?!

- గాజుల వెంకటేశ్వరరావు



నవ్వుల్ - పువ్వుల్

అడ్రస్

తండ్రి: నేను ఒక కథ రాశాను. దాన్ని ప్రచురణకు పంపుదామనుకొంటున్నాను.
కొడుకు: మరి ఇంకా ఎందుకు పంపలేదు నాన్నా!
తండ్రి: నాకు ఏ పబ్లిషర్ అడ్రస్ తెలీదు.
కొడుకు: అదా! సింపుల్ నాన్నా! ఒక ఉత్తరం రాసి ఎవరో ఒకరి అడ్రస్ తెలుసుకో.

శాలరీ

(ఓ వ్యక్తి ఒక కంపెనీలో డ్రైవర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకొంటాడు)
మేనేజర్: ఓకే! నీకు స్టార్టింగ్ శాలరీ రెండు వేల రూపాయలు ఇస్తాం. సంతోషమేనా!
వ్యక్తి: చాలా బావుందిసార్. మరి డ్రైవింగ్ శాలరీ ఎంతండీ?

పిరికివాడు

వ్యక్తి: ఏంటి నువ్వు మరీ అంత పిరికివాడివా?
గార్డ్: కాదు. అలా ఎందుకడిగావ్?
వ్యక్తి: ఏంలేదు?! ఎప్పుడూ గన్ను తగిలించుకొని తిరుగుతుంటేనూ...

సలహా

రాజు: నాన్నా! నిన్న నువ్వు నాకు ఓ సలహా ఇచ్చావుకదా. పెద్దపిల్లలు చిన్నపిల్లలతో పోట్లాడకూడదని.
తండ్రి: అవును కన్నా.
రాజు: మరి ఇదే మాట మా క్లాస్ టీచర్‌కు కూడా చెప్పు నాన్నా!

పనిచేశాయ్

రోగి: డాక్టర్! మీ మందులు చాలా బాగా పనిచేశాయి.
డాక్టర్: అంటే...నీరోగం తగ్గినట్టేనన్నమాట.
రోగి: కాదు డాక్టర్! నా జబ్బు ఇంకా తగ్గలా. కాకపోతే మా అబ్బాయి సమస్య తీరింది. వాడు మీరిచ్చిన రంగు రంగుల బిళ్లలతో కదలకుండా కూర్చుని ఆడుకొంటూ నన్ను విసిగించడం మర్చిపోయాడు.

చిన్నవి

సురేష్: రెండు కిలోల బంగాళదుంపలు ఇవ్వండి
(కూరగాయల అబ్బి ఇస్తాడు)
సురేష్: ఏంటయ్యా మరీ ఇంత పెద్దవి ఇచ్చావు. చిన్న చిన్నవి చూసి ఇవ్వు. తీసుకెళ్లడానికి తేలిగ్గా వుంటుంది.

ఇష్టమైన కూర

రాజు: అమ్మా! ఇవాళ నాన్నకు ఇష్టమైన కూర వండమ్మా...!
తల్లి: ఎందుకు కన్నా!
రాజు: ఇవాళ మాకు ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తారమ్మా.

కరుస్తుందా?

మహేష్: మేం ఇవాళ ఒక కొత్త కుక్కను తీసుకొచ్చామోయ్. చూడ్డానికి వస్తావా?
దినేష్: అది కరుస్తుందా?
మహేష్: అది తెలుసుకుందామనే నిన్ను రమ్మంది.

శుభవార్త-దుర్వార్త

డాక్టర్: ఏమయ్యా! నీకు ఒక శుభవార్త. ఒక దుర్వార్త.
రోగి: ముందు దుర్వార్త చెప్పండి డాక్టర్.
డాక్టర్: నీ కాలు తీసేయాలోయ్.
రోగి: ఇప్పుడు శుభవార్త ఏమిటో చెప్పండి డాక్టర్.
డాక్టర్: ఏంలేదు. ఆ పక్క బెడ్డు మీద వ్యక్తి నీ బూట్లు అమ్మితే కొనుక్కుంటాడంట.

మార్చుకున్నా

రామారావ్: నేను నా మనసు మార్చుకున్నాను.
సుబ్బారావ్: పోన్లే... ఇదైనా సరిగ్గా పనిచేస్తే మంచిదే.

సీరియల్

వియత్నాం వీరుడు

ఎన్‌గుయెన్ వాన్ ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

జరిగినకథ

ట్రాయ్‌ను చూడ్డానికి జైలుకెళ్లిన కుయేన్‌కు పోలీసు అధికారులు ఒక అబద్ధం చెప్తారు. ట్రాయ్ కాథలిక్కు మతం స్వీకరించాడని చెప్తారు. అది విన్న కుయేన్ పరుగెత్తుకుంటూ లోపలికెళుతుంది. తన కోసం కుయేన్ తెచ్చిన పొట్లాలవైపు చూసి ట్రాయ్ నొచ్చుకుంటాడు. వాటికి డబ్బు ఖర్చు చేసే బదులు తమ పెళ్లికైన బాకీలు తీర్చమంటాడు. పైగా తను కాథలిక్కు మతం స్వీకరించడం ఒట్టి అబద్ధమని చెప్తాడు. ఇంటి దగ్గర కుయేన్‌కు సౌకర్యంగా వుందా అనడుగుతాడు. అవసరానికి చేతి ఉంగరం అమ్మివేసినట్టు చెప్తాడు. ప్రాణం సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా వున్న తను ఉంగరం అమ్మడానికి వెనకాడలేకపోయానని చెప్తాడు. ఆ తర్వాత...

(పదమూడో భాగం)

తన చేతులతో నా ముఖాన్ని తవుడుతూ వున్నాడు. నేను బిగ్గరగా ఏడ్చాను. ఇలా అన్నాను.

'దయచేసి మీరు అలా అనకండి. నేను అలాంటి తెలివి తక్కువదాన్నని తెలుసు. అప్పట్లో నీ గాఢ విశ్వాసాన్ని చూరగొన లేకపోయాను. లేకపోతే వైర్ కావలసివచ్చినప్పుడు నేను ఎందుకు కొని ఇవ్వలేకపోయాను?'

'మన పెళ్ళిరోజు దగ్గరపడుతున్న కొద్దీ నేను నేను ఈ పవిత్ర కార్యక్రమంలో లీనమైపోయాను. ఇది చాలా ప్రమాదభరితమైన పని. మనకు శోభనమైనాక కొన్ని రోజులు నాకు సెలవు ఇవ్వడానికి పైవాళ్ళు ఇష్టపడ్డారు. కాని పట్టువిడవకుండా నా పంతం చెల్లించుకోవాలనుకున్నాను. అమెరికా దురాక్రమణదారులను చంపడానికి సరైన అదనుకోసం కాచుక్కూర్చున్నాను.

'వారి అగ్రనాయకుల్లో ఒకరిని హతమార్చేందుకు అప్పుడు మంచి అవకాశం చిక్కింది. నిజంగా ఇటువంటి సదవకాశాన్ని ఎలా చేజేతులా జార విడువగలను? మా నాయకుల అంగీకారంతోనే నేనందుకు అతి రహస్యంగా సిద్ధమయ్యాను. ఇందుకు సంబంధించిన ఏ విషయాన్ని నీకు చెప్పలేదు.

'ఎందుకంటే మన పెళ్ళి జరగబోయేముందు ఈ విషయాలు చెప్పి నీ మనసుకు బాధ కలిగించదలచుకోలేదు. అమెరికన్ దురాక్రమణదారులను హతమార్చాలన్న పవిత్ర కర్తవ్యం నెరవేరిన తర్వాత క్రమక్రమంగా నా ఉద్యమ నిర్మాణంలో నిన్ను ఒక సభ్యురాలు చేద్దాం కదా అని అనుకున్నాను. నా భార్య గానే కాకుండా సుశిక్షిత కామ్రేడ్‌గా నిన్ను తయారు చేద్దామనే నా ప్రగాఢ వాంఛ'

కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత అన్నాడు.

'ఎవరి పాపనైనా పెంచుకుంటున్నావా?'

'లేదు' అన్నట్టు తలూపాను.

అలా లేదనడం ఆయన మనసుకు చాలా బాధ కలిగించిందని నేను భావించాను. అంతలో ఒక పోలీసువాడు 'టైం అయిపోయింది' అని అరిచాడు. సరిగ్గా ట్రాయ్ వయస్సు గల మరో ఖైదీ వాకిట్లోంచి లోపలికి వచ్చాడు. అతనికి నన్ను పరిచయం చేస్తూ ఇలా అన్నాడు :

'నాకు స్నేహితులు చాలా సహాయపడుతున్నారు'

ఆయన స్నేహితునితో నేనిలా అన్నాను :

'నా భర్తగారి ఆరోగ్యం బావుండటం లేదు. దయచేసి చూస్తూ ఉండండి. మీకు కృతజ్ఞురాలినై ఉంటాను.'

'అలా అనకు మేమందరం కలిసి జైల్లో ఉంటున్నప్పుడు ఒకరికొకరం సహాయం చేసుకుంటూనే వుంటాం. కృతజ్ఞతలు మాకక్కర్లేదు.

మేము తప్పునిసరిగా పరస్పరం జాగ్రత్తగా చూచుకుంటూనే ఉంటాం ఏమీ బాధపడకండి.' అన్నాడు ఆ స్నేహితుడు.

నేను తీసుకెళ్ళిన పొట్లాలన్నీ ఆయనకు ఇచ్చాను. ట్రాయ్ మళ్ళీ ఇలా అన్నాడు : 'మళ్ళీ నీకు రావడానికి అనుమతించినట్లయితే నాకు భోజనం కోసమని ఇంత డబ్బు ఖర్చు పెట్టవద్దు.

***

నన్ను శ్రీమతి యం. దత్తపుత్రికగా చేసుకుంది. ఒకరోజు నాకు జబ్బు చేసింది. ఆ జబ్బుతోనే పనిలోకి వెళ్ళాను. జైలువద్దకూడా వెళ్ళి నాభర్తకు భోజనం యిచ్చి వచ్చాను. అప్పుడు ఆమె హృదయం పరితపించిపోయింది.

ఆమె ఇలా అన్నది :

'నేను నీ వయసులో ఉన్నప్పుడు నా భర్తను గూడా జైల్లో నిర్బంధించారు. అప్పుడు నేను నరకం అనుభవించాను. నే నాయన్ను చూడ్డానికి వెళ్ళినప్పుడల్లా భోజనం తీసుకెళ్ళి యిచ్చేదాన్ని. కొంత కాలానికి విడుదల చేసి మళ్ళీ అరెస్టు చేసి జైల్లో నిర్బంధించారు. ఆయన చిహోవా జైల్లోనే మరణించాడు.'

ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ఒక కుమారుడు ఏడెనిమిది సంవత్సరాలుగా సోవియట్ యూనియన్‌లో చదువుకుంటున్నాడు. రెండవవాడు ప్రజాసైన్యంలో ఒక సిపాయి.

కరపత్రాలు పంచిపెడుతున్నందుకు, దక్షిణ వియత్నాం జాతీయ విమోచనా సంఘటన నిర్మాణమై ఉన్నదని ప్రచారం చేస్తున్నందుకు నాలుగు సంవత్సరాల కిందట ఆమె కుమార్తెను అరెస్టు చేశారు. బ్రతుకు తెరువుకై ఒక చిన్న వ్యాపారం చేసుకొంటూ మేనకోడలితో ఉంటున్నది. ఆమె కొన్ని ఫోటోలు చూపించింది.

అవి సోవియట్ యూనియన్‌లోనూ, ఉత్తర వియత్నాంలోనూ తీసిన ఫోటోలు, హనోయ్ జాతీయ దినోత్సవం, ఈమె కోడలు తన బిడ్డలతోనూ, ఒక బట్టలు మిల్లు కార్మికుడు బాల్కనీ మీద నిలబడి ఉన్నప్పుడు తీసిన ఫోటోలు అవి. ప్రతి ఫోటోను గురించి నాకు వివరించింది.

ఇలా అన్నది :

వాళ్ళు ఎలా సుఖ సంతోషాలు అనుభవిస్తున్నారో మనం తప్పక తెలుసుకోవాలి.

నా దత్తతల్లి ఉత్త బోళామనిషి. నేను మూడవసారి ట్రాయ్‌ని చూడ్డానికి వెళ్ళినప్పుడు ఆయనకు చాలా బహుమతులిచ్చి పంపింది.

అప్పుడామె ఇలా చెప్పింది :

"నా కుమారులు సోవియట్ యూనియన్‌లో ఉన్నా ఉత్తర వియత్నాంలో ఉన్నా వాళ్ళను గురించి నేను అంతగా పట్టించుకోవడం లేదు. వాళ్ళు ఎలాగూ సుఖంగా జీవిస్తున్నారు. నా బాధ అంతా ఛిహువా జైల్లో వున్న ఇద్దరు బిడ్డల గురించి మాత్రమేనని ట్రాయ్‌తో చెప్పు'

జైల్లో వున్న తన ఇద్దరు బిడ్డలు ఎవరంటే తన కుమార్తె, నా భర్త ట్రాయ్ అని ఆమె అర్థం.

ఈసారి చిన్న క్యాన్‌ను గూడ నాతో తీసుకెళ్ళాను. మామూలుగా ట్రాయ్ నా కోసం ఎదురు చూస్తుండే చోటుకు నడిచి వెళ్ళాం. ట్రాయ్‌ని మొదట చూచింది క్యాన్.

'టూ సోదరా!అని పెద్దగా పిలిచింది.

నేను చాలా సంతోషించాను. ఆయన చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. మునుపటి వలె చిక్కిపోయినట్లు గాకుండా నిండుగా కనపడుతున్నాడు. తల వెంట్రుకలు మామూలుగానే క్రాపు చేయబడి వున్నాయి. వాకిట్లోకి వచ్చాడు. కాలు లాక్కొంటున్నాడు. ఇంకా ఆ కాలు పూర్తిగా నయం కాలేదు. క్యాన్ ఆయన వైపుకు తొంగి చూచింది.

"అమ్మ, నాన్న అంతా బాగున్నారా?'

'అంతా కులాసాగా ఉన్నారు. మునుపటికంటే ఇప్పుడు కాస్త దిట్టంగా ఉన్నారు కదూ!'

ఆయన చిరునవ్వు నవ్వాడు. అరెస్టయిన తర్వాత అప్పుడప్పుడు మాత్రమే ఆయన పెదాల మీద చిరునవ్వు చూశాను. కాని ఈరోజు మాత్రం ప్రత్యేకంగా ఆనందోత్సాహంతో ఉన్నాడు. నా చేతిని గట్టిగా పట్టుకొంటూ ఇలా అన్నాడు.

'నేను నిజంగా బరువెక్కుతున్నాను. నువ్వు మాత్రం సన్నగా చిక్కిపోతున్నావు. నీకై నువ్వే కష్టాలు పెంచుకుంటున్నావు కదూ!'

ఎప్పటివలె జవాబివ్వడానికి ప్రయత్నించాను.

'కానే కాదు. నీవు చెప్పిన ప్రకారం రోజుకు ఎనిమిది గంటల కంటే ఎక్కువ పనిచేయడం లేదు.'

చిన్ని క్యాన్ ఆయన భుజాలను పెనవేసుకుంది. కావలేసుకొని ముఖంలోకి నేరుగా చూస్తూ ఇలా అడిగింది :

'విరిగిన కాలు ఏదీ?'

ఆయన తన కుడికాలు చూపించాడు.

"కానీ ఇది ఇప్పుడు చాలా వరకు నయం అయిపోయింది లే." అన్నాడు.

క్యాన్ పెదాలు విరుచుకుంది.

"నన్ను నీ చేతుల్లోకి తీసుకో".

క్యాన్‌ను తీసుకొని ఒడిలో కూర్చో బెట్టుకున్నాడు. ఇలా అడిగాడు :

"నీవు బడికి వెళ్తున్నావా? అక్షరాలేమైనా నేర్చుకున్నావా?"

"ఓ నాకు చాలా వచ్చు. నిన్ను చూడ్డానికి ఒక్క పూట సెలవు అడిగింది కుయేన్ అక్కయ్య. ఎక్కడా నువ్వుండేది టూ సోదరా?"

"పైన రెండో అంతస్తులో చాలా ఎత్తు."

"నన్ను అక్కడకు తీసుకెళ్ళవూ?"

ట్రాయ్ నవ్వాడు.

"నువ్వు రాకూడదు. నేను జైల్లో ఉన్నాను కదా"

"మరీ ఇంటికెప్పుడొస్తావ్?"

ట్రాయ్ ఇలా గట్టిగా చెప్పాడు :

"ఉగాది పండుగనాడు నేను తప్పకుండా ఇంటికి వస్తాను. నీవు బాగున్నావు కదా! మీ కుయేన్ అక్కయ్యను మరచిపోకుండా అప్పుడప్పుడూ వచ్చి చూస్తూండు."

"నేను అక్కయ్యను చూసిన ప్రతిసారి ఏడుస్తూనే ఉంటుంది." క్యాన్ చెప్పింది.

ట్రాయ్ ఆశ్చర్యంగా చూసాడు.

'ఎందుకూ ఎప్పుడూ ఏడుస్తూండటం?'

నేను వారించడానికి ప్రయత్నించాను.

'లేదు నేను ఏడ్వడం లేదు.'

'లేకపోతే క్యాన్ ఎందుకు చెబుతోంది. పసిపిల్లలు అబద్ధం చెప్పరు. క్యాన్ అలా చెబుతున్నదంటే నిజంగా ఏడుస్తూనే వుండి వుంటావు.'

నేను మౌనంగా ఉండిపోయాను.

కొంచెంసేపాగి ట్రాయ్ ఇలా కొనసాగించాడు :

'అనేక కష్టాలతో జీవిస్తున్నావ్ ష్ ఐనా సంతోషంగా ఉండాలి. ఇవి జీవితంలో చివరి కొద్దిరోజులు మాత్రమే. అయినప్పటికీ జైలు కొట్లలోని కామ్రేడ్లంతా ఆనందోత్సాహాలతో పాటలు పాడుకొంటున్నారు.

'సైగాన్‌లో గొప్ప సార్వత్రిక సమ్మె జరిగింది. సైగాన్ పట్టణంలో నీరు, ఎలక్ట్రిసిటీ బంద్! ఎంతటి ఉత్సాహం!!

'ఇంతకుముందు ఒకసారి ఇలాగే సమ్మె జరిగింది. ఒకటి లేక కొన్ని సంఘాలు మాత్రమే ఆ సమ్మెలో పాల్గొన్నాయి ఇప్పుడీ సమ్మెలో అన్ని సంఘాలు అమితోత్సాహంగా పాల్గొన్నాయి.

'నేను యువజన సంఘంలో సభ్యత్వం తీసుకున్న తర్వాత స్వల్పకాలిక శిక్షణ కోసం రాజకీయ పాఠశాలకు పంపారు. అక్కడ అధ్యాపకుడు చాలా విచిత్రమైన మనిషి. అక్కడ నేను ఒక కార్మికుడుగా కార్మికుని శ్రమశక్తి అదనపు విలువను గురించి తెలుసుకున్నాం.

'ఒకసారి అధ్యాపకుడు నన్నిలా ప్రశ్నించాడు. 'నీవు ఒక ఎలక్ట్రీషియన్‌వు కదూ? అవును బావుంది. మీ ఇంట్లో ఎన్ని విద్యుత్ పరికరాలున్నాయి? చెప్పు చూద్దాం.

'నేను అలా దీర్ఘంగా ఆలోచించి యిలా జవాబిచ్చాను. 'ఒక వస్తువుకూడా లేదు. మాకున్నది గుడ్డి దీపాలు మాత్రమే. నేను నివసిస్తున్న ప్రాంతమంతా అవే.'

అధ్యాపకుడు నవ్వాడు. 'ఎలక్ట్రీషియన్లకు కూడా ఎలక్ట్రిసిటీ లేదు. ఇది నిజంగా అన్యాయం కదూ? అమెరికన్ల నివాస భవనాలు చూడు – వాళ్ళ కుక్కల దొడ్లకు కూడా కరెంటు దీపాలు వెలుగుతున్నాయి.

(మిగతా భాగం వచ్చేవారం)

ఈ పేజ్

ఆన్‌లైన్లో డైరీ...



నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. కొత్త సంవత్సరంలో కొత్త నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలు నిర్దేశించుకోవడం పరిపాటి. ఆ నిర్ణయాలను, లక్ష్యాలను, రోజువారీ వ్యాపకాలను నిక్షిప్తం చేసుకోవడం ప్రపంచంలో ఎంతోమందికి ఒక వ్యాపకంగా వుంటుంది. ఆ వ్యాపకమే డైరీ రాయడం, లేదా ముఖ్యమైన తేదీలను, విషయాలను రాసుకోవడం, ముఖ్యమైన లెక్కలు రాసుకోవడం... ఇవన్నీ సర్వసాధారణం. అయితే నిత్యం కంప్యూటర్‌తో గడుపుతూ, ఆన్‌లైన్‌లో పనిచేస్తూ, కంప్యూటర్ లేకపోతే క్షణం కూడా గడవని పరిస్థితులలో ప్రత్యేకంగా మళ్ళీ డైరీ రాయడం అంటే కాస్త ఇబ్బందికరమైన విషయమే. అదే కంప్యూటర్‌లోనో, నెట్‌లోనో అటువంటి సదుపాయం వుంటే, పుట్టినరోజులు వంటి కొన్ని ముఖ్యమైన విషయాలను, ఫోన్‌నెంబర్లను ఏదో పుస్తకంలోనో డైరీలోనో రాసి ఎక్కడ రాశామో కూడా మర్చిపోతుంటాం. సమయానికి మనకు గుర్తుచేసేటటువంటి సదుపాయం వుంటే ఎంత బాగుంటుంది అని కూడా అనుకుంటాం. ఇలాంటి విషయాలన్నిటినీ సమయానికి గుర్తుచేసే సౌలభ్యం, సదుపాయాలు మన కంప్యూటర్‌లోనూ, నెట్‌లోనూ అనేకం ఉన్నాయి.

- కె.ఎక్స్.రాజు

జీవితంలో ఎదురయ్యే అనుభవాలను, ఎవరితోనూ పంచుకోలేని వ్యక్తిగత విషయాలను రాసుకోవడానికి డైరీ ఉపయోగిస్తాం. ఎలక్ట్రానిక్ యుగంలో జీవితమంతా కంప్యూటర్‌పై గడిచిపోతూ, సాధారణ డైరీలలో చేతితో రాసుకునే తీరికలేనివారు కంప్యూటర్‌లోనే వున్న సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు.

వాటిలో కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌లో వుండే అడ్రస్‌బుక్ ఒకటి. అదేవిధంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇమెయిల్స్‌ను ఉపయోగిస్తూనే వుంటారు. జిమెయిల్, యాహూ, రెడిఫ్, హాట్‌మెయిల్... ఇలా ఏదైనా కావచ్చు. వాటిలో క్యాలెండర్ వుంటుంది. దానిని కూడా ఒక డైరీలా ఉపయోగించుకోవచ్చు. ఇవే కాకుండా 'ఎఫిషియంట్ డైరీ' వంటి అనేక సాఫ్ట్‌వేర్స్ నెట్‌లో దొరుకుతున్నాయి. వాటిని డౌన్లోడ్ చేసుకొని వాడుకోవచ్చు.

అడ్రస్ బుక్

ఎటువంటి సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ ప్రక్రియలు అవసరం లేకుండానే మీ అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు, ముఖ్యమైన విషయాలను భద్రం చేసుకోవచ్చు. కంప్యూటర్‌లోని స్టార్ట్-ప్రోగ్రామ్స్-యాక్సెసరీస్‌లోకి వెళితే మెనూలో 'అడ్రస్ బుక్' కనిపిస్తుంది. అది ఓపెన్ చేసుకొని-టూల్‌బార్‌లోని 'న్యూ-న్యూ కాంటాక్ట్‌ని ఎంచుకుని కాంటాక్ట్ వివరాల్ని ఎంటర్ చేయవచ్చు. నేమ్, హోమ్, బిజినెస్, పర్సనల్, అదర్ ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేయవచ్చు. ఫైండ్ పీపుల్‌తో కావాల్సిన కాంటాక్ట్‌ని వెతకొచ్చు. ప్రింట్ కూడా తీసుకోవచ్చు. ఇంపోర్ట్ ద్వారా ఇతర అడ్రస్ మేనేజ్‌మెంట్ టూల్స్‌ని కాంటాక్ట్స్‌ని అప్‌లోడ్ చేసుకోవచ్చు. జాబితాలోని అడ్రస్‌పై డబుల్‌క్లిక్ చేసి ఎడిట్ చేయవచ్చు.



ఎఫిషియంట్ డైరీ

మన అనుభవాలను అనుభూతులను, ముఖ్యమైన తేదీలను రాసుకోవడానికి చక్కగా ఉపయోగపడుతుంది. ఈ ఉచిత వ్యక్తిగత డైరీ సాఫ్ట్‌వేర్‌లో మీ అనుభవాలు, ఐడియాలు మరియు కావాల్సిన సంగతులను పొందుపర్చుకోవచ్చు. టైప్ చేసుకోవడానికి వీలుగా రిచ్ టెక్స్ట్ ఎడిటర్ వుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఓపెన్ చేసుకొన్న తర్వాత 'న్యూ డైరీ ఎంట్రీ' బటన్‌పై క్లిక్ చేస్తే టైప్ చేసుకోవడానికి వీలుగా ఒక టెక్స్ట్‌ప్యాడ్ వస్తుంది. దీనిలో టైప్ చేసుకోవచ్చు. అదేవిధంగా ఈ సాఫ్ట్‌వేర్‌లో మీ ఎంట్రీలకు టేబుల్, ఎమోషన్స్, పిక్చర్స్, బ్యాక్‌గ్రౌండ్ కలర్, ఎటాచ్‌మెంట్స్ జతచేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం

http://www.efficientdiary.com.

క్యాలెండర్లు

మనం ఉపయోగిస్తున్న ప్రతి ఇమెయిల్ సర్వీస్‌లోనూ 'క్యాలెండర్' అనే ఫీచర్ తప్పనిసరిగా వుంటుంది. ఇది ప్లానర్‌ను పోలివుంటుంది. మన దైనందిన కార్యక్రమాలను వీటిలో నమోదు చేసుకోవచ్చు. మనకు అవసరమైనప్పుడు గుర్తు

చేయడానికి పాపప్ రిమైండర్లు, ఇమెయిల్ రిమైండర్లను కూడా సెట్ చేసుకోవచ్చు. ఉదా: జి మెయిల్‌లో పైభాగంలో కనిపించే క్యాలెండర్ బటన్‌పై క్లిక్ చేస్తే ప్రత్యేక విండో ఓపెన్ అవుతుంది. ఇది ప్లానర్‌ను పోలివుంటుంది. దీనిలో ఎడమవైపున ఆ నెలకు సంబంధించిన తారీఖులు కనిపిస్తుంటాయి. ఎడమవైపు పైభాగంలో 'డే, వీక్, మంత్, 4డేస్, అజెండా' అనే బటన్స్ వుంటాయి. వాటిపై క్లిక్ చేసుకుంటే దానికనుగుణంగా తేదీలు వాటికింద డిస్‌ప్లే అవుతాయి. అదేవిధంగా ఎడమవైపునున్న క్యాలెండర్‌పైన 'క్రియేట్ ఈవెంట్' ఆప్షన్‌పై క్లిక్ చేస్తే వచ్చేపేజీలో సంబంధిత వివరాలను నోట్ చేసుకొని రిమైండర్‌ను కూడా పెట్టుకోవచ్చు.

ఈజీ ప్లానర్

దీనిని ఉపయోగించి నోట్స్ రాసుకోవచ్చు. క్యాలెండర్ మేనేజ్ చేసుకోవచ్చు. పాస్‌వర్డ్స్ సేవ్ చేసుకోవచ్చు, ఖర్చులు నమోదు చేసుకోవచ్చు, డైరీ రాసుకోవచ్చు. దీనిలో సులువుగా వివిధ రంగులను ఉపయోగించి ప్లానర్‌ను ఆకర్షణీయంగా తయారుచేసుకోవచ్చు. దీనిని
http://web.tiscali.it/esyweb/
వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఇవేకాకుండా ఈ తరహాలో మన అనుభవాలను, అనుభూతులను రాసుకొనేందుకు అవసరమైన సదుపాయాలతో ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్న అనేక సాఫ్ట్‌వేర్లను ఉపయోగించుకోవచ్చు.

ఎఫిషియంట్ అడ్రస్ బుక్ ఫ్రీ

మరిన్ని సౌకర్యాలతో ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లను భద్రం చేసుకోవాలనుకుంటే ఎఫిషియంట్ అడ్రస్ బుక్ ఫ్రీను దిగుమతి చేసుకోవచ్చు. దీనిలో ఫొటోలను కూడా అప్‌లోడ్ చేసుకోవచ్చు. టూల్‌బార్‌లోని కూడిక గుర్తుపై క్లిక్ చేసి అడ్రస్ వివరాల్ని ఎంటర్ చేయండి. జనరల్, డిటెయిల్స్, ఫొటోస్, ఆల్‌ఫీల్డ్స్ ట్యాబ్‌లతో కాంటాక్ట్ విండో వస్తుంది. వ్యక్తి ఫొటోలను అప్‌లోడ్



చేయాలంటే ట్యాబ్‌ను ఎంచుకుని యాడ్‌ను క్లిక్ చేయండి. వాటికి వ్యాఖ్యలు రాయవచ్చు. మొత్తం కాంటాక్ట్ వివరాల్ని చూడాలంటే ఆల్ ఫీల్డ్స్ ఎంచుకోండి. అడ్రస్‌లను మీకు కావాల్సినట్టుగా ప్రింట్ తీసుకోవచ్చు. సెర్చ్‌తో అడ్రస్‌లను వెతకొచ్చు. టూల్స్ మెనూలోని ఎక్స్‌పోర్ట్‌తో ఇతర సర్వీసుల్లోని అడ్రస్‌లను అప్‌లోడ్ చేయవచ్చు.

http://tinyurl.com/2bfubu7

హ్యాండీ అడ్రస్ బుక్

సిస్టమ్‌లో భద్రం చేసుకున్న అడ్రస్‌లను ఆంగ్ల అక్షరమాల ఆధారంగా సులభంగా వెతికేలా రూపొందించేదే హ్యాండీ అడ్రస్ బుక్. దిగుమతి చేసి ఇన్‌స్టాల్ చేయగానే టూల్ బార్, మెనూ బార్ ఎ టూ జెడ్ అక్షరాలు కనిపిస్తాయి. యాడ్‌పై క్లిక్ చేసి అడ్రస్‌లను నిక్షిప్తం చేయవచ్చు. హైడ్‌ను ఎంచుకోగానే సిస్టమ్ ట్రేలోకి వెళ్ళిపోతుంది. తిరిగి కావాలనుకుంటే ట్రేలోని ఐకాన్‌పై క్లిక్ చేస్తే సరి. ఎడమవైపు వున్న అక్షరాలపై క్లిక్ చేస్తూ కావాల్సిన కాంటాక్ట్‌ని పొందొచ్చు.

http://tinyurl.com/handy-address-book



ఇ-జెడ్ కాంటాక్ట్ బుక్

కుటుంబం, స్నేహితులు, వ్యాపారం.... ఇలా విభాగాల వారీగా అడ్రస్‌లను భద్రం చేసుకోవడానికి ఇ-జెడ్ కాంటాక్ట్ బుక్‌ను నిక్షిప్తం చేసుకోండి. పర్సనల్, బిజినెస్ ట్యాబ్‌లను ఏర్పాటు చేశారు. అదర్ ట్యాబ్‌లోని క్యాలెండర్‌లో పుట్టినరోజు వివరాల్ని నిక్షిప్తం చేయవచ్చు. రిమైండ్ మీ ఫర్ ద్వారా ముందే గుర్తు చేసేలా షో పాపప్ రిమైండర్‌ను పెట్టుకోవచ్చు.

http://tinyurl.com/E-z-contact-book

సిఆర్ఎం-ఎక్స్‌ప్రెస్

అడ్రస్‌బుక్‌తోపాటు క్యాలెండర్, టాస్క్‌లు, జర్నల్స్‌తో రూపొందించే సిఆర్ఎం-ఎక్స్‌ప్రెస్ ఇన్‌స్టాల్ చేసి ఓపెన్ చేయగానే పాస్‌వర్డ్ అడుగుతుంది. అడ్మిన్‌ను ఎంటర్‌చేసి ఓపెన్ చేయండి. వచ్చిన విండోలోని అడ్రస్‌బుక్, క్యాలెండర్, టాస్క్స్, జర్నల్ మెనూలు కనిపిస్తాయి. నెంబర్లు ఎంటర్ చేయడానికి అడ్రస్‌బుక్- న్యూపై క్లిక్ చేయండి. క్యాలెండర్ ట్యాబ్‌ను ఎంచుకుని రోజులో చేయాల్సిన పనుల్ని పెట్టుకోవచ్చు. అలాగే టాస్క్ మెయింటెనెన్స్‌ను ఏర్పాటు చేయవచ్చు.

http://tinyurl.com/2vbbybs

మై ఫోన్ బుక్ డైలర్

మెనూలు, టూల్‌బార్‌లు లేకుండా చిటికెలో కాంటాక్ట్‌లను భద్రం చేసుకోవాలంటే 'మై ఫోన్ బుక్ డైలర్' నిక్షిప్తం చేసుకోండి. ఒకే విండోలో టెక్స్ట్ బాక్సుల రూపంలో దీన్ని రూపొందించారు. నిక్షిప్తం చేయగానే తెరపై వచ్చిన మైఫోన్ గుర్తుపై క్లిక్ చేయాలి. ఫోన్ డైరెక్టరీ పేరుతో వచ్చిన విండోలోని న్యూ ఎంచుకుని నేమ్, అడ్రస్, కంపెనీ, ఇమెయిల్, వెబ్‌పేజీ, మొబైల్ నెంబర్‌లను ఎంటర్ చేయవచ్చు.

http://tinyurl.com/252k7nf

★

సినిమా కబుర్లు

మత్తు వదిలించిన మహా సంక్షోభం



- రెంటాల జూనియర్

తెలుగు చిత్రసీమ స్తంభించింది. డిసెంబర్ 8న 'కందిరీగ' షూటింగ్‌లో గొడవతో మొదలైన సంక్షోభం ఈ వ్యాసం ప్రచురణకు వెళుతున్న నాటికి కూడా దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రత్యేక అనుమతి సాధించిన 'జై బోలో తెలంగాణ' తప్ప మరి ఏ ఇతర తెలుగు సినిమా నిర్మాణ, నిర్మాణానంతర కార్యకలాపాలూ తెలుగునాట అధికారికంగా సాగడం లేదు. రెండు వారాలుగా పనులు లేక సగటు సినీ కార్మికులు అల్లాడుతుంటే, సంక్షోభంలో సదేమియాగా నిర్మాణ వ్యయం పొదుపు విషయంలో చేపట్టాల్సిన చర్యలు ఏమిటా అని దర్శకులు, హీరోలను కలుపుకొని నిర్మాతలు మల్లగుల్లాలు పడుతున్నారు. వెరసి, పరిశ్రమలోని మత్తు వదలించి, అందరినీ ఆలోచింపజేసిన 'సమ్మె' ఇది.

తమిళ ఫైటర్ల మీద తెలుగు ఫైటర్లు జరిపిన దాడికి నిరసనగా డిసెంబర్ 9న ఓ రోజు షూటింగ్‌లను నిలిపి వేస్తున్నట్లు నిర్మాతలు మొదట ప్రకటించారు. రాష్ట్రంలో చిత్ర నిర్మాణంలో పాలు పంచుకొనే 24 శాఖల సినీ టెక్నీషియన్లకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏ.పి.ఎఫ్.ఐ.ఇ.ఎఫ్)కు ఈ ఏకపక్ష నిర్ణయంతో సహజంగానే కోపం వచ్చింది. ఎన్నోనాళ్ళుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలన్నిటినీ పరిష్కరిస్తే కానీ షూటింగ్‌లో పాల్గొనరాదని నిర్ణయించింది. అలా అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి (టి.ఎఫ్.పి.సి) అమాంతం పుచ్చుకుంది. చిత్రపరిశ్రమను వేధిస్తున్న సమస్యలన్నీ పరిష్కారమయ్యే వరకూ నిరవధికంగా షూటింగ్‌లు నిలిపివేయాలని నిర్మాతలు నిశ్చయించారు.

సమస్య నుంచి సంక్షోభానికి...

ఏతావాతా, తమ ప్రయోజనాలను కాపాడాలనీ, వేతనాలను సవరించాలనీ స్థానిక స్టంట్ మాస్టర్ల చిన్న డిమాండ్‌తో మొదలైన వ్యవహారం నిర్మాతల మండలి నిర్ణయంతో ఓ పెను సంక్షోభానికి తెర తీసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిర్మాణ (స్టూడియోలు, నిర్మాతలు), పంపిణీ, ప్రదర్శక రంగాలన్నిటి ప్రయోజనాలూ కాపాడాల్సిన పెద్ద అయిన ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) సైతం నిర్మాతల మండలి నిర్ణయానికి తల ఊపింది. అలా అనుకోని సమ్మె రూపంలో అన్నీ స్తంభించిపోయాయి.

ఒక పక్క తారల పారితోషికాల్లో కోత విధించాలని నిర్మాతల మండలి డిమాండ్ చేస్తోంది. మరో పక్క సాంకేతిక నిపుణులు న్యాయంగా తమకు జరగాల్సిన వేతనాల సవరణ జరపాలని కోరుతున్నారు. ఇంకో పక్క బడ్జెట్ తగ్గాలంటే సినిమా ప్రారంభానికి ముందే పూర్తిగా సిద్ధం చేసిన బౌండ్ స్క్రిప్టుతో వచ్చేలా కఠినమైన మార్గదర్శకాలు పెట్టాలనీ, షూటింగ్ దినాలపై నియంత్రణ ఉండేలా చూడాలనీ తారలు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద, దిశ లేకుండా ఉరుకులు పరుగులతో గమ్యం లేని పయనంలో కొట్టుకుపోతున్న తెలుగు చిత్ర పరిశ్రమ ఒక్కసారి ఆగి, ఆలోచించుకొనే పరిస్థితికి తాజా సంక్షోభం కారణమైంది. ఆ మేరకు ఈ సంక్షోభం స్వాగతించదగినదే! "ఈ సమ్మె మన మంచికే!" అని అగ్ర హీరో, నిర్మాత నాగార్జున ఆ మధ్య అన్నది అందుకే!!

అయితే, విషాదం ఏమిటంటే – నిర్మాతల్లో సైతం అంతర్గత విభేదాలున్నాయి. భారీ బడ్జెట్ చిత్ర నిర్మాతలు, చిన్న బడ్జెట్ చిత్రాల నిర్మాతల మధ్య కూడా పరస్పరం నమ్మకం లేదు. దానికి తోడు ప్రతి ఒక్కరూ తమ తమ సొంత డిమాండ్లు చేస్తూ పోతుండడంతో ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), ఫెడరేషన్ల మధ్య సమావేశాలు, చర్చలు తీవ్ర వాదోపవాదాల మధ్యే నడుస్తున్నాయి. నిరసన వాకౌట్లూ జరుగుతున్నాయి. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నాయకత్వ లోపానికి అద్దం పడుతున్నాయి. సమస్యకు సరైన పరిష్కారం మటుకు ఇప్పటికీ రాలేదు.

ఎవరి మాట వారిది!

"ఫైటర్ల మధ్య గొడవ జరిగాక, మేమంతా సమావేశమై పరిస్థితిని సమీక్షించే లోపే, షూటింగ్‌ల బంద్‌కు నిర్మాతల మండలి పిలుపునిచ్చింది. మరోపక్క వారే చిత్ర నిర్మాణానంతర కార్యక్రమాలు చేసుకోవచ్చంటూ ప్రకటిస్తున్నారు. ఆ పనులు చేయాల్సింది కూడా మా ఫెడరేషన్ సభ్యులే! మా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎవరూ విధులకు హాజరు కారాదని నిర్ణయించుకున్నాం. సమస్యల పరిష్కారం కోసం చర్చలకు పిలిస్తే, మేము సిద్ధం" అని ఏ.పి. ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కోటగిరి వెంకటేశ్వరరావు చెప్పారు. అయితే, "అందరికీ పెద్దగా వివాదాలు పరిష్కరించాల్సిన ఫిల్మ్ ఛాంబర్ సైతం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఉండడం బాధాకరం" అని ఆయన అన్నారు.

మొత్తం మీద తెలుగు చలనచిత్ర పరిశ్రమ అనేక గ్రూపులుగా విడిపోయి, ఒకదానితో మరొకటి కలహించుకుంటున్నట్లు కనిపిస్తోంది. షూటింగులు మళ్ళీ ఎప్పుడు మొదలవుతాయో ఎవరూ చెప్పలేని పరిస్థితి తలెత్తింది. కాగా, చర్చలతో సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాల్సిన రెండు వేర్వేరు గ్రూపుల ఫైటర్ల మధ్య వివాదాన్ని చివరకు ఇలా నిరవధిక సమ్మెగా పరిణమింపజేయడం పరిశ్రమలో చాలా మందికి విస్మయం కలిగిస్తోంది.

ఏ వర్గానికి ఆ వర్గం తమ ప్రయోజనాల కోసం పట్టుదలకు పోతూ ఉండడంతో వ్యవహారం పీటముడి పడిపోయింది. టెక్నీషియన్లేమో వేతనాలు పెంచాలని కోరుతున్నారు. నిర్మాతలేమో అందుకు ఇష్టపడడం లేదు. తారలు పారితోషికాలను తగ్గించుకుంటే, టెక్నీషియన్ల వేతనాలు పెంచవచ్చునీ, లేదంటే నిర్మాణ వ్యయం మరింత భారమవుతుందనీ నిర్మాతలు వాదిస్తున్నారు. నటీనటులేమో తమ పారితోషికాల్లో కోతకు సిద్ధంగా లేరు. బడ్జెట్లు పెరగడంలో తమ బాధ్యత ఏమీ లేదంటున్నారు. చాలా మంది దర్శకులకు దూరదృష్టి లేకపోవడం, చిత్ర నిర్మాణంలో క్రమశిక్షణ లేకపోవడమే అదుపు

తప్పుతున్న బడ్జెట్లకు కారణమంటూ, తప్పును అటువైపు నెట్టేస్తున్నారు. "ఇలా ఒకరి మీదకు మరొకరు నెపం పెడుతుండడంతో, వ్యవహారం ఎటూ తేలడం లేదు. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందో, మళ్ళీ మేమెప్పుడు పని మొదలుపెడతామో అర్థం కావడం లేదు. అంతా అగమ్యంగా ఉంది" అని ఓ వర్ధమాన దర్శకుడు వాపోయారు.

ఆగిన నిర్మాణంతో ఆగని బాధలు

ఫైనాన్షియర్ల దగ్గర నుంచి తెచ్చిన అప్పులతో సాగే చిత్ర నిర్మాణం సైతం ఈ వ్యవహారంతో తిప్పలు తెచ్చిపెట్టింది. "సినిమా తీయడం కోసం మేము డబ్బులు ఫైనాన్స్ తెచ్చాం. ఇప్పుడు గనక నిర్ణీత సమయానికి సినిమాను పూర్తి చేసి, విడుదల చేయకపోతే, రిలీజుకు ముందే మేము నష్టాల్లో కూరుకుపోతాం" అని ఈ నెలలోనే విడుదల కావాల్సిన ఓ చిత్ర నిర్మాత వ్యాఖ్యానించారు. సరిగ్గా ఇదే కారణాలపై 'జై బోలో తెలంగాణ' చిత్ర దర్శక - నిర్మాత ఎన్. శంకర్ తమ చిత్ర నిర్మాణ, నిర్మాణానంతర కార్యక్రమాలకు అనుమతించాల్సిందిగా ఫిల్మ్ ఛాంబర్‌కూ, నిర్మాతల మండలికీ, సినీ ఉద్యోగుల ఫెడరేషన్‌కీ విజ్ఞప్తి చేశారు. ఆయన వినతిపై అవి సానుకూలంగా స్పందించాయి. ఆ చిత్రానికి సంబంధించిన పనులు చేయాలని ఫెడరేషన్ ఏకగ్రీవంగా తీర్మానించి, ముందుకొచ్చింది. అయితే, అన్ని చిత్రాలకూ అంత అదృష్టం లేదు. ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న కొన్ని భారీ బడ్జెట్ చిత్రాలతో సహా కనీసం 20 చిత్రాల నిర్మాణం స్తంభించిపోయినట్లు సినీ వర్గాల కథనం.

షూటింగ్‌లు ఆపేసిన నిర్మాతల మండలి చిత్ర నిర్మాణ వ్యయం అదుపు కోసమంటూ డిసెంబర్ రెండో వారంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో భాగంగా నిర్మాతలు, దర్శకులు, నటులు కలసి నిర్మాణ వ్యయంపై ముఖ్యమైన నిర్ణయాలు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిర్మాణ వ్యయాన్ని ఎలా అదుపు చేయాలి? పారితోషికాలు తగ్గించాలా? వృథా వ్యయం ఏ దశలో జరుగుతోంది లాంటి అంశాలపై ఈ కమిటీలో చర్చలు జరుగుతున్నాయి. అగ్ర హీరోలు, నిర్మాతలు, దర్శకులు కొందరు ఈ కమిటీలో సభ్యులుగా చర్చల్లో పాలుపంచుకున్నారు. అయితే, ఆ చర్చల్లోని ప్రతిపాదనలపై ఇప్పటికీ ఓ ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు.

చేజేతులా తప్పులు - తప్పనిసరి తిప్పలు

అసలు ఈ పెరిగిన నిర్మాణ వ్యయానికి మూలాలు ఎక్కడున్నాయని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే - 2000వ సంవత్సరం తరువాత నుంచి తెలుగు చిత్ర పరిశ్రమలో ఖర్చులు విపరీతంగా పెరిగినట్లు అర్థమవుతుంది. అగ్ర తారలు మొదలుకొని పేరున్న దర్శకులు, సాంకేతిక నిపుణుల దాకా అందరి పారితోషికాలూ ఒక్కసారిగా పైకి దూసుకుపోయాయి. దీంతో ఖర్చులు పెరిగిపోయాయి. అయితే, దుష్ప్రభావం అక్కడితో ఆగిపోలేదు. చివరకు చిత్ర నిర్మాణంలో అనుసరించే పని పద్ధతులు, క్రమశిక్షణ కూడా మారిపోయాయి. దర్శక, నిర్మాతలు కలసి స్క్రిప్టును క్షుణ్ణంగా చర్చించుకోవడం, ముందుగా ఓ బడ్జెట్ అంచనాకు రావడం, సన్నివేశాల చిత్రీకరణకు తగిన లొకేషన్లను అన్వేషించి, ముందస్తుగా ఖరారు చేసుకోవడం లాంటి కాలపరీక్షకు నిలబడిన మంచి పద్ధతులన్నీ గాలికి పోయాయి.

క్రేజీ కాంబినేషన్ల కోసం వెంపర్లాడడమే తప్ప, చిత్ర నిర్మాతలు స్క్రిప్టు, అందుకు అవసరమైన సరైన తారాగణం ఎవరన్నది లోతుగా పరిశీలించడం పోయింది. సరైన బడ్జెట్ అంచనా కానీ, నిర్మాత - తారలు - దర్శకుల మధ్య సరైన అవగాహన కానీ, ప్రీ-ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ బృందాలతో అనుబంధం కానీ మృగ్యమయ్యాయి. మామూలు పరిస్థితుల్లో చూసీచూడనట్లుగా నడిచిపోయినా, తీరా ఆ మధ్య ఆర్థిక మందగమనం వచ్చేసరికి, ఇవన్నీ ఒక్కసారిగా పీకలు నొక్కే పెను సమస్యలయ్యాయి. ఫలితంగా, తెలుగు చిత్ర నిర్మాతలు తాజాగా ఖర్చులు తగ్గించుకొనే ప్రక్రియలో పడ్డారు. చిత్ర నిర్మాణ వ్యయాన్ని అదుపులో పెట్టడం కోసం పారితోషికాల తగ్గింపు మొదలు అనేక అంశాలపై మల్లగుల్లాలు పడుతున్నారు.

మునుపటి కమిటీల మాటేమిటి?

నిజానికి, తాజా సంక్షోభం కన్నా చాలా నెలల ముందు ఈ ఏడాది మే ప్రాంతంలోనే ఈ అంశాలపై తెలుగు చలనచిత్ర నిర్మాతల సంఘం పక్షాన ఓ కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ చిత్ర నిర్మాణ వ్యయాన్ని ఎలా తగ్గించాలనే అంశంపై రకరకాల ప్రతిపాదనల్ని పరిశీలించింది. వాతావరణం వేడెక్కుతున్న సంగతి గమనించి, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' (మా)తో సహా పలువురు నటులు పారితోషికాలతో సహా అన్ని విషయాల్లో నిర్మాతలకు అండగా నిలుస్తామంటూ అప్పట్లో హామీ కూడా ఇచ్చారు. అయితే, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఏమిటో, దాని అతీ గతీ ఏమిటో ఇప్పటి దాకా తెలియలేదు. కాగా, ఫైటర్ల మధ్య ఘర్షణతో తలెత్తిన తాజా సంక్షోభంవల్ల మళ్ళీ కొత్తగా మరో కమిటీ ఏర్పాటైంది. నిర్మాతలు, దర్శకులు, హీరోలు - ఈ మూడు వర్గాల నుంచి కొందరు ప్రముఖులతో ఏర్పాటైన ఈ కొత్త కమిటీ ఇప్పుడు నిర్మాణ వ్యయం తగ్గింపుపై చర్చోపచర్చలు జరుపుతూ, కిందా మీదా పడుతోంది.

వాస్తవానికి, 1976లో, 1980ల మొదట్లో కూడా ఇలాంటి పరిస్థితులే తలెత్తాయి. దాంతో, అప్పట్లో నిర్మాతలు పొదుపు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఈ సారి కూడా నిర్మాతలు పొదుపు మంత్రం పఠిస్తున్నారు. కానీ, పై పై పొదుపు చర్యలతో ప్రయోజనం లేదు. ఒక సినిమా అనూహ్యంగా ఘన విజయం సాధించి, గరిష్ఠంగా రూ. 10 కోట్ల దాకా వసూలు చేసిందంటే, ఆ కాంబినేషన్‌లో వచ్చే తరువాతి సినిమాను లేనిపోని హైప్‌లో, రూ. 11 కోట్ల బడ్జెట్‌లో నిర్మించడం తెలుగు చిత్ర పరిశ్రమ నైజం. ఇలా ఎప్పటికప్పుడు రిస్కును పెంచుకుంటూ పోయే ఈ స్వీయహనన ధోరణిని మార్చుకోకపోతే కష్టమే. అలాగే, కార్మికుల వేతనాలకూ, పరిశ్రమలో నిర్మాతలు, హీరోలు, దర్శకులు చేపట్టాల్సిన జాగ్రత్తలకూ ముడిపెట్టడం కూడా సమంజసంగా తోచదు. దర్శకుడు వరప్రసాద్ మాటల్లో చెప్పాలంటే, "నిజానికి, రోగం ఏమిటో తెలుసు. శరీరంలో ఏ భాగానికి రోగమో తెలుసు. ఔషధం కూడా ఎదురుగానే ఉంది. కానీ, దాన్ని పట్టించుకోకుండా ఎక్కడెక్కడో వెతుకుతున్నాం!" ఈ మాట మన పరిశ్రమ పెద్దలు వింటారా?

★



అట్టమీది కథ

కాలం ఖాతాలో... వీడ్కోలు వీక్షణం...

- తెలకపల్లి రవి

కాలం....నన్ను.. పదే... పదే
పలకరించింది......
ఎదురుగా నిలబడి... వెక్కిరించింది - నన్ను
హెచ్చరించింది.'

కవి శేషగిరి రాసిన ఈ వాక్యాలు కాలం స్వభావాన్ని చక్కగా చెబుతాయి. కరిగిపోయే స్వప్నం కాలం. ఆనకట్ట వేసుకోకపోతే సాగరం చేరే నదీ జలం వంటిది కాదు, వున్నప్పుడే వినియోగించుకోకపోతే తర్వాత దక్కని విద్యుచ్ఛక్తి వంటిది కాలం. అయితే మనిషిని శాసించడానికి ఎంతగా ప్రయత్నిస్తుందో తనను అదుపులో పెట్టగలిగిన వారికి అంతగా లోబడిపోయేది కాలం అన్నాడు మహాకవి శ్రీశ్రీ.

కాలం ఒక ఖాళీ. కాలం ఒక పాళీ. కాలం ఒక సవాలు. కాలం ఒక జవాబు. కాలం ఒక ప్రణాళిక. కాలం ఒక ప్రహేళిక. కాలం ఒక ప్రవాహం. కాలం ఒక ప్రభావం. కాలం ఒక అవకాశం. కాలం ఒక అవరోధం. కాలం ఒక గమ్యం. కాలం ఒక గమనం. కాలం ఒక పతాక. కాలం ఒక ప్రతీక. కాలం ఒక వాహకం. కాలం ఒక వాహనం. కాలం ఒక జ్ఞాపకం. కాలం ఒక దీపకం.

కాలాన్ని గురించి రాయని కవి లేడు. మాట్లాడని తత్వవేత్త లేడు. కాలానికి అపాదించబడని విశేషాలు లేవు. కాని కాలం కదలికకు పెట్టుకున్న ఒక కొండగుర్తు మాత్రమే. కాలాన్ని గురించి చెప్పుకునే ఆ విశేషాలన్నీ ఆ కాలంలో జరిగిన లేదా జరగని కార్యాచరణల వివరాలే. ఎందుకంటే కార్యాచరణే లేకపోతే కాలానికి అర్ధమే లేదు. కనీసం ఈ నాటి మానవులు కోణంలో చెప్పుకుంటే కాలాన్ని కొలవాల్సింది నెలలు సంవత్సరాల్లోనే కాదు. కార్యాచరణతో. అలాంటి సమీక్షా వీక్షణానికి సరైన సందర్భం నూతన సంవత్సరాగమనం. నూతన శతాబ్దిలో సహస్రాబ్దిలో తొలి దశాబ్ది ఆ రీత్యా సింహావలోకనానికి మరింత మంచి సందర్భం కూడా.

కాల గమనంలో అనుభవాలన్నీ ఆనందదాయకమే కాకపోవచ్చు. అన్నీ అపజయాలేనని అనవసరంగా నిట్టూర్చినా అంతా అప్రతిహత ప్రతిభా విశేషమేనని హూంకరించినా ప్రయోజనం శూన్యం. వాస్తవాలను గమనిస్తూ వాటి ప్రాతిపదికన వాస్తవిక వ్యూహాలతో ముందుకు మున్ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించాలి. **'కాలాన్ని కొలవడానికి క్యాలండర్లు, పంచాంగాలు ఎందుకు దండగ కద, ప్రజా జీవితానుభవాలే చాలును పద'** అని కుందుర్తి తన తెలంగాణా కావ్యాన్ని ముగిస్తాడు.

ఎక్కడ మొదలు..ఎక్కడ ముగింపు...

కాలానికి ఏడాది కొండ గుర్తు అనుకుంటే ఏడాది కిందట లేదా ఈ ఏడాదిలో ఏమనుకున్నాము, ఏం చేశాము, అసలేమైనా అనుకున్నామా? ఏమీ అనుకోకపోతే ఇప్పుడైనా వచ్చే ఏడాదికైనా ఏమైనా అనుకుందామా అని చూసుకోవడం మొదటి మెట్టు. అలాంటి ఆలోచనే లేకపోతే జీవితం చీకట్లో తడుములాటగానే మారిపోతుంది. ప్రతి వారికి ఏవో ఆకాంక్షలు, ఆశలూ, ఆశయాలు వుండనే వుంటాయి. ఎక్కువమంది తమ వృత్తి వుద్యోగ వ్యాపారాలు కుటుంబాల పరిధిలోనే ఆలోచించినా కొద్ది

శాతమైనా సమాజ పరంగా సంస్థాగతంగా ప్రణాళికలు అనుకుని వుంటారు.కొత్త పుంతలు తొక్కాలని భావించి వుంటారు. ఇదో నిరంతర ప్రక్రియ. డైరీలు రాసే అలవాటున్న వారు లేదా నోట్‌ప్యాడ్‌లు వుపయోగించేవారు కొంతమందైతే అనేక మంది ఆలోచనలు వారి మస్తిష్కాల్లోనే బంధితమై వుంటాయి. ఈ ఏడాది ముగింపు తరుణంలో వాటిని తెరిపార చూసుకోవాలి.

వ్యక్తిగత స్థాయిలో ప్రధానాంశాలేమిటి? మన శక్తి సామర్థ్యాలు పెంచుకున్నామా లేక ఏ కారణంగానైనా తగ్గు ముఖం పట్టాయా? ★వున్న శక్తికి తగిన ఫలితాలు సాధించగలిగామా?★మనకు ఇష్టమైన రంగాల్లో లేదా అంశాల్లో కాస్తయినా ముందుకు కదిలామా? ఆరోగ్యాన్ని గురించి శ్రద్ధ తీసుకున్నామా? ఆర్థిక స్థితిగతులు అదుపులోనే వున్నాయి కదా, శక్తికి మించిన భారంలో కూరుకుపోవడం లేదు కదా?★కుటుంబం పట్ల, సమాజం పట్ల మన బాధ్యతను సవ్యంగా నెరవేర్చినట్టేనా? పిల్లల పట్ల, జీవిత భాగస్వాముల పట్ల, పెద్దల పట్ల మన వంతు శ్రద్ధ తీసుకున్నామా? తీసుకోకపోతే ఏ కారణం వల్ల? చేయగలిగీ చేయలేకపోయినవేమైనా వున్నాయా?★మంచిని ప్రోత్సహించడానికి, చెడును నిరోధించడానికి ఈ ఏడాది మొత్తంలో ఏమైనా మనంగా చేశామా?★ఈ ఏడాదిలో కొత్త విషయాలు నిపుణతలు ఏ మాత్రమైనా సాధించామా లేక వేసిన కాడున్న గొంగళిని తలపిస్తున్నామా?★మనలో క్రమశిక్షణ, కనీసం శ్రమ శిక్షణ ఏమైనా మెరుగుపడ్డాయా దిగజారాయా?★మనను అభిమానించే ఆదరించే వారి పట్ల సవ్యంగానే ప్రవర్తించామా? ఇతరులతో మన అనుభవాలు ఎలా వున్నాయి? ... ఇవీ ఇలాంటివీ ఇంకా అనేకానేక కోణాల నుంచి పరిశీలించుకోవడం ద్వారా ఏడాది గమనం ఎలా వున్నదీ బేరీజు వేసుకోవచ్చు. ఇవన్నీ వ్యక్తిగత స్థాయిలో విషయాలే గనక ఎవరికి వారు నిష్పక్షగా సమీక్షించుకోవచ్చు. ఏ విషయంలోనైనా వున్న వాస్తవాలను సూటిగా అంగీకరించడం సానుకూల ఫలితాలుంటే మరింత మెరుగుచేసుకోవచ్చు. ప్రతికూల ఫలితాలుంటే సరిదిద్దుకోవచ్చు. అనుకున్నది సాధించామా లేదా అని చూసుకొన్నప్పుడు మనకు మనమే మార్కులు వేసుకునే మాష్టార్లలాగా నిర్ణయాలకు రావచ్చు. ఇతరుల పట్ల ఒకింత ఉదారంగా వుండొచ్చునేమో గాని ఎవరికి వారు మినహాయింపులు ఇచ్చుకోకూడదు. ఆ పైన కుటుంబ సభ్యులతోనూ, బంధుమిత్రులతోనూ కలిసి చర్చించవచ్చు. సమాజం అంటే వ్యక్తుల సమూహమే గనక వ్యక్తిగత స్థాయిలో జరిగే ఈ పరిశీలనలు అందరికీ ఉపయోగపడతాయి.. నిర్దాక్షిణ్యంగా తమ ఏడాది నడకను అంచనా వేసుకోవాలి. అందులో సంతోషించవలసింది వుంటే తమ వరకూ తప్పక సంతోషించి ఆ పైన సమిష్టి అంచనా కోసం ఎదురు చూడాలి. ఆ రెంటికీ తేడా వస్తే మరోసారి పరిశీలించుకోవాలి. అంతేగాని విమర్శలు వస్తే భరించలేకపోవడం లేదా అవన్నీ నిజమే అనుకుని అతిగా క్రుంగిపోవడం తగని పనులు.

ఒకటి.. రెండు..మూడు..

జీవితంలో ప్రాధాన్యతా క్రమం చాలా కీలకమైంది. ఏది ప్రథమం, ఏది ద్వితీయం ఏది ప్రధానం ఏది అప్రధానం అన్న విచక్షణ వుండాలి. ప్రధానాంశాల్లో ప్రగతికి ప్రాముఖ్యతనిచ్చి పరిశీలించుకోవాలి. అందరూ అన్ని వేళలా ఒకే ప్రాధాన్యతలు పాటించడం అసంభవమే కాక అనవసరం. దాని వల్ల శక్తియుక్తులు పూర్తిగా సద్వినియోగం కావు కూడా. అందుకే ఎవరైనా తమ జీవిత గమనాన్ని, పని విధానాన్ని ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత ఆ అవగాహనకు అనుగుణంగా ప్రాధాన్యతలు రూపొందించుకోవాలి తప్ప అన్నిటికీ ఒకే మంత్రం పనికి రాదు. ఉదాహరణకు ఒక వుద్యోగి, ఒక వ్యాపారి, రాజకీయ నాయకుడు, కళాకారుడు, అందరికీ ఒకేలా వర్తించే అంశాలు పరిమితమైతే వారి వారి పని ఫలితాలను కూడా ఒకే ప్రమాణంతో తేల్చలేము. కనకనే గడచిపోయిన కాలాన్ని వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు అతిగా పొంగిపోయినా అనవసరంగా కుంగిపోయినా తప్పే అవుతుంది.

కాలరథం అన్న గేయంలో నార్ల చిరంజీవి ఇలా అంటాడు– **మంచు వంటిది గతం/మళ్లీ కనిపించదు/వెనక్కు తిరిగి చూడకు/వెళ్లిపోయిందెపుడో/ నీలో ఆశల్ను చిదిమేస్తూ/కాలం వెళ్లిపోయింది/ కత్తి వంటిది /చిరిగిన జీవితాలు /చిగురిస్తాయి సుమా...** కనక కాలం కఠోరానుభవాలను చూపించినపుడు కూడా కంపించి పోనవసరం లేదు. ఆశావిశ్వాసాలు నిలబెట్టుకోవాలి. **'వెనక చూసిన కార్యమేమోయి మంచి గతమున కొంచెమేనోయ్ అన్న గురజాడ మాటలను గుర్తు చేసుకుని మందగించక ముందుకడుగెయ్'.**

వ్యక్తులుగా ఎవరు
నిట్టూర్చినా మరెవరు
నిప్పులు కక్కినా

కాలం కావాలి యువ కరవాలం!

బద్ధకం యువతకు సహజమన్నట్టు మాట్లాడుతుంటారు. వారు నిద్ర లేవడం దగ్గర నుంచి కబుర్లలో మునిగితేలడం వరకూ అన్ని సందర్భాల్లోనూ ఈ లక్షణం కనిపిస్తుంటుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం యువతకే ఎక్కువ అవసరం. వారు సవ్యంగా వినియోగించుకోవడంపైనే భవిష్యత్తు కూడా ఆధారపడి వుంటుంది. కాలంతో పరుగు తీయగల సామర్థ్యమూ వుంటుంది. కొత్త భావాలను, చక్కటి ఆశయాలనూ స్వంతం చేసుకోగల స్వచ్ఛత కూడా వుంటుంది, వివేకానందుడు, భగత్ సింగ్, సుందరయ్య ఇలా మహనీయులు ఎవరిని చూసినా చిన్నతనంలోనే ప్రతిభా విశేషాలతో పాటు ప్రణాళికా బద్ధమైన కృషి కూడా కనిపిస్తుంది. అందువల్లనే కుర్రాళ్లనగానే కాలక్షేపానికి, అస్పష్టతకు మారు పేరుగా వుంటారన్న భావన వుండాలన్న యోచన వాస్తవమైంది కాదు. పైగా ఆలోచనా పరిపక్వత వేగంలో గతానికి ఇప్పటికి చాలా తేడా వచ్చింది గనక అభివృద్ధి క్రమంలోనూ ఈ వేగం పెంచుకోవలసి వుంటుంది. ఆటపాటలు, వినోద వికాసాలకు కాలాన్ని సరిగ్గా విభజించుకోవడం చిన్నప్పుడే నేర్చుకుంటే అది జీవితాంతపు అలవాటుగా మారుతుంది. తెలివైన యువత తమ శక్తి సామర్థ్యాలు యావత్తూ పాఠ్యగ్రంథాలపైన లేదా ర్యాంకులు వ్యక్తిగత లక్ష్యాల సాధనపైనే వెచ్చించకుండా సామాజిక పరిజ్ఞానం సేవలు పెంచుకునే దిశగా కూడా ప్రణాళిక వేసుకోవాలి. అమ్మ నాన్నలు ప్రేమగా అన్నీ సిద్ధం చేసి వుంచుతారనే ఆలోచన మార్చుకుని తామూ కొంత పాలు పంచుకునే విధంగానూ వ్యవహరించాలి. తమ ఆలోచనలకు అభిరుచులకు తామే పరిధులు, పరిమితులు విధించుకునే బదులు విశాలంగా మలుచుకోవాలి. అధ్యయనం, ఆచరణ, అభివృద్ధి అన్న దిశలో ప్రతి నిముషం వినియోగించుకోవాలి.

నిట్టూర్చినా కాలం ముందుకే పోతుంది. దాన్ని వెనకే వుంచాలని వెనక్కు తీసుకుపోవాలని కొందరు తంటాలు పడుతుంటారు గాని ఫలితం వుండదు.

'కదలిన కాలపు గమనం మార్చి /గడచిన దినాల గాయం రేపగ / తలలు నెరిసిన తాతలెందరో / తలకిందులుగా తపసు చేసినా/ కాలం కదిలింది మనకై కాలం కదిలింది- ముందుకె కాలం కదిలింది' అని సుధీర్ (డా॥విరల్) రాసిన పాట కాలం పట్ల వుండాల్సిన దృక్పథాన్ని చెబుతుంది. కాలం మనిషిని పరీక్షిస్తుంది. అదే సమయంలో ఆత్మ విశ్వాసం పెరిగేలా రాటు దేలడానికది కారణమవుతుంది. శ్రీశ్రీ 'జయభేరి'లో **'ఎండ కాలం మండినప్పుడు/ గబ్బిలం వలె కాలిపోలేదా/ శీత కాలం కోత పెట్టగ / ఆకలేసి కేకలేశానే?'** అని వివిధ రుతువుల ప్రభావాలను చెప్పిన తర్వాత **'నేను సైతం/ భువన భవనపు /బావుటానై పైకి లేస్తా'**నని ధీమాగా చాటిస్తాడు. ఈ విశ్వాసం ప్రతి ఒక్కరికీ అవసరం. అదే సమయంలో వ్యక్తిత్వ వికాసం పేరిట వ్యక్తిగత వికాసం మాత్రమే చెప్పే వారిలా కాకుండా పదిమందితో కలసి నడవడంలో వున్న సహజీవన సౌందర్యాన్ని అర్థం చేసుకోవాలి. పైన చెప్పుకున్నట్టు సమిష్టిగానూ బేరీజు వేసుకోవాలి.

కుటుంబ కదంబం...

మొదటగా కుటుంబం ఎప్పుడూ ప్రజాస్వామిక ప్రక్రియలో వుండేలా చూసుకోవాలి. అందుకు మొదటి మెట్టు ఉమ్మడిగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం, ఆ దిశలో నడతను పరిశీలించుకోవడం. ఇక్కడ కూడా పైన చెప్పుకున్న కొలబద్దలన్ని వర్తిస్తాయి. ★కుటుంబంలో తరచూ ప్రస్తావనకు వచ్చే సమస్యలు ఈ కాలంలో పరిష్కారమయ్యాయా? ★ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా వ్యవహరించామా? ఏమైనా పేరబెట్టామా? ★చదువు సంధ్యలపై తగు శ్రద్ధ చూపిస్తున్నామా? ★జమా ఖర్చుల నిష్పత్తి ఎలా వుంది? చేయి దాటిపోతుందా? ★వస్తువుల వినిమయం పరిస్థితి ఏమిటి? అనవసరమైన వాటిని కొనడం, అత్యవసరమైన వాటిని దాటేయడం జరుగుతున్నదా? ★ఏడాదిలో ఒక్కసారైనా ఏదైనా చిన్నదో పెద్దదో పర్యాటక యాత్ర చేశామా? ★స్నేహ సంబంధాలు పెంచుకుంటున్నామా? మన కారణంగా ఏవైనా సంబంధాలు దెబ్బతిన్నాయా? అలా జరిగి వుంటే పునరుద్ధరించుకోవడం ఎలా? ★కుటుంబ నిర్వహణ భారం ఒకరిద్దరిపై అదనంగా పడుతుందా? లేక క్రమబద్ధంగా పంపిణీ జరుగుతున్నదా? శ్రుతిమించిన బద్ధకం పెరిగిపోతున్నదా? ★గృహిణికి కనీస విశ్రాంతి విరామం ఇచ్చే పరిస్థితి వుందా? ★రేపటి తరం మనుషులైన పిల్లల జీవితం పట్ల సరైన దృక్పథం పెంపొందిస్తున్నామా? వారి పురోగతికి సహకరిస్తున్నామా? అరాచకత్వం ఛాయలు కనిపిస్తున్నాయా? ఇలాటి ప్రశ్నలు వేసుకుని సపరివారంగా సమీక్షించుకోవచ్చు. మామూలు రోజువారీ ఘర్షణలలోనే మునిగితేలే వారు ఇలా ఏడాది చివర్లోనైనా కూచుని పరిశీలించుకుంటే అనేక ఆశ్చర్యకరమైన వాస్తవాలు తెలియొచ్చు. ఆనందమూ కలగొచ్చు.

సమిష్టి బృందాలు... సంస్థలు...

ఇక సంస్థలు ఏ విధమైనవైనా సరే వాటికి కొన్ని లక్ష్యాలుంటాయి. లక్షణాలుంటాయి. గమ్యాలుంటాయి. గమనమూ జరిగివుంటుంది. అందులో పైనున్న బాధ్యులు నిర్వాహకులు లేదా యాజమాన్యాలు నిర్ణయించే విషయాలు అనేకం వుంటాయి. అయితే అమలుకు వచ్చేసరికి మళ్లీ సమిష్టిగానే అమలవుతాయి. వీటిలో ఉమ్మడి నియమావళి పరిధిలో పరిశీలన చేసుకోవలసి వుంటుంది. విద్యా సంవత్సరం ఒక మాసంలో ఆర్థిక సంవత్సరం మరో మాసంలో వ్యవసాయం మరో తరుణంలో ముగింపునకు వస్తాయి గాని కాలక్రమణిక మాత్రం ఒకే విధంగా వర్తిస్తుంది. కనక సమిష్టిగానూ వ్యక్తిగతంగానూ జరిగింది జరగాల్సింది చూసుకోవడానికి సంవత్సరాది సరైన తరుణం. పైగా విద్య ఆర్థిక సంవత్సరాలలో మిగిలిపోయిన లక్ష్యాలను గబగబా పూర్తి చేసుకోవలసిన అవసరం ఏమిటో కూడా ఇప్పుడే చూసుకుంటే చాలా మేలు కలుగుతుంది.

తప్పనిసరి పనులు...తక్షణ పనులు...

పనిచేసే సందర్భంలో చాలా కీలకమైన విభజన ఇది.. తప్పక చేయవలసిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేసుకుంటూ పోకపోతే అవి గొంతుమీదకు వస్తాయి. అనుకోకుండా వచ్చిపడేవి అర్జెంటు పనులు తప్ప పేరబెట్టి పేరబెట్టి ఆఖరి ఘడియలో చేసేవి ఆ కోవకు రావు. ఒక వ్యాధిని ముందే చూపించుకోగలిగితే మామూలు మందులతోనే నయం కావచ్చు. ముదిరిపోయిన తర్వాత అత్యవసర చికిత్స చేసినా ఫలితం వుండకపోవచ్చు. పరీక్షలకు చదువుకోవడం అలాంటిదే. ఒక బిల్లు కట్టడానికి వున్న వ్యవధినంతా పోగొట్టుకుంటే అది ప్రాణం మీదకు వస్తుంది. అంత ఆదరాబాదరాగా చేసేప్పుడు నాణ్యత కూడా దెబ్బతినిపోవడం సహజం.. ఒక ప్రణాళిక ప్రకారం చేస్తే ప్రామాణికంగానూ చేసుకోవచ్చు. ఇదో ప్రాథమిక సూత్రం. కుందేలు తాబేలు సామెత ఇలాంటిదే. కాలాన్ని సరిగ్గా ఉపయోగించుకోగలిగితే లక్ష్యాన్ని తప్పక చేరుకోవచ్చు. అలాగాక అతి ధీమాతో అలక్ష్యంతో సమయం వృథా చేసుకుంటే తర్వాత సంతృప్తి వుండదు.

విలువైన సమయం... విసుగెత్తే పనులు...

కాలాన్ని వినియోగించుకోవడంలో విభజించుకోవడం కూడా కీలకమైంది. ప్రధానమైన వాటికి ఎక్కువ సమయం, చురుకైన సమయం తీసుకోవాలి. టీవీలలో ప్రైమ్ టైమ్ అంటూ వుంటారు. అంటే విలువైన సమయం అన్న మాట. టీవీలకే కాదు దైనందిన జీవితంలో కూడా ఈ తేడా వుంటుంది. కొంతమంది తెల్లవారుఝామున



మరికొందరు కాస్త పొద్దెక్కాక ఇంకా కొందరు బాగా ఆలస్యంగా నిద్ర లేవడం దగ్గరే ఈ తేడా మొదలవుతుంది. ఎన్టీరామారావు త్వరగా పడుకుని తెల్లవారుఝామున రెండున్నరకే లేచి తెల్లవారే సరికి యోగాసనాలు, పనులు పూర్తి చేసుకునేవారు. జీవితంలో తీరిక లేకుండా పని చేసేవారందరి పొద్దు లేవడం దగ్గరే మొదలవుతుంది. ఈ విషయంలో మీ పరిస్థితి ఏమిటో చూసుకోవడం మంచిది. మీరు ఆలస్యంగా లేచినా ప్రపంచం ముందే సిద్ధమై పోతుంటుంది. కొంతమంది రాత్రి బాగా పని చేసి ఆలస్యంగా లేస్తుంటారు. ఈ రెండూ కాని పరిస్థితి కూడా వుంటుంది.

నిద్ర లేవడం, నిత్య నైమిత్తికాలు పూర్తి చేసుకోవడం ఎంత సమయం తీసుకుంటుంది? లేదా మామూలు భాషలో చెప్పాలంటే రెడీ కావడం ఎంత త్వరగా చేసుకోగలుగుతారు? ఆడవాళ్లు రెడీ కావడానికి చాలా సమయం తీసుకుంటారని జోకులేస్తుంటారు గాని వాస్తవంలో పురుష పుంగవులు చాలా మంది ఒక పట్టాన తెమలరు. అంత ఆలస్యం ఎందుకవుతుందో కూడా తెలియకుండానే సాగదీసి సమయం వృథా చేస్తుంటారు.

ఇక ప్రైమ్ టైమ్ సంగతి. రోజూ చూడండి- 9 గంటలకు అటూ ఇటూగా రోడ్లన్నీ కిక్కిరిసి వుంటాయి. అలాగే సాయంత్రం 5-7 మధ్యన కూడా. అంటే ఇవి చాలా కీలకమైన వేళలన్న మాట. మీ వృత్తిని బట్టి మీకూ ఏదో సమయం వుంటుంది. దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. దాన్ని నిరర్థకంగా పోగొట్టుకోకూడదు. ఆ సమయంలో ఎవరో ఆగంతుకులు వచ్చారని నిస్సహాయంగా బలైపోకూడదు. కొందరు తమ సమయం చాలా జాగ్రత్తగా చూసుకుంటూ ఇతరుల సమయాన్ని హరించేందుకు మాత్రం వెనుకాడరు. ఉదాహరణకు ఇలాంటి వారు మిమ్మల్ని కలుసుకోవాలంటే వాళ్లకు అనుకూలమైన సమయం అడుగుతారు తప్ప మీ కష్టనష్టాలు పట్టించుకోరు. కనక నిర్మొహమాటంగానూ, మర్యాదగానూ ఇలాంటి

గడిచిపోయిన క్షణము తిరిగిరాదు....

ఎవరైనా సరే తమ సమయాన్ని ఎక్కువ ఉపయోగపడే విషయాలకు వినియోగించడం వివేకవంతమైన పని. అంటే చేసే పని ఎక్కువ మందికి ఎక్కువ కాలం ఉపయోగపడాలి. ఇది వాస్తవిక అంచనాలపై ఆధారపడి వుంటుంది. రాయిని పొదిగితే ఫలితం లేదని గుడ్డును పొదిగితేనే పిల్ల వస్తుందని తెలుసుకోవడం లాంటిదే ఇది. **తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు, దవిలి మృగతృష్ణలో నీరు తాగవచ్చు, తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు, చేరి మూర్ఖుని మనము రంజింపలేము' అన్న పద్యంలో మాదిరిగా అనవసరమైన పనులలో శక్తి వృథా చేసుకోవడం గాక సత్ఫలితాలిచ్చే అంశాలను ఎంచుకోవాలి. గతం కన్నా భవిష్యత్తుకేసి చూడాలి. రాలిపోయే దానికన్నా చిగురించే దానిపై కృషి చేయాలి.** ఏ ఒక్కరికో ఉపయోగపడే వాటికంటే పది మందికి పనికి వచ్చే అంశాలపై కష్టపడాలి. ఆలోచనలు ఘనీభవించిన వ్యక్తులతో గంటల తరబడి వాదించడం కంటే గ్రహణ శక్తి గల కొత్త శక్తులను ప్రోత్సహించడం మెరుగు. బలవంతుల చుట్టూ ప్రదక్షిణలు చేసే బదులు బలహీనులను బలోపేతం చేయడం మెరుగు. తెలిసిన వారికి మన తెలివిని చూపి మెప్పు పొందే బదులు తెలియని వారికి చెప్పడానికి శ్రద్ధ పెట్టడం మెరుగు.సరిగ్గా రాని దానికోసం అదే పనిగా సమయం వెచ్చించే బదులు వచ్చిన దాన్ని మెరుగు పెట్టుకోవడం మెరుగు. కేవలం విమర్శలకు గంటలు కేటాయించే బదులు మనంగా మెరుగుపర్చడానికి సమయం కేటాయించడం మెరుగు. అవసరమైన పనులు, ఆసక్తికరమైన పనులు చేయడం వల్ల సామర్థ్యం పెరగడమే గాక సమాజానికి కూడా మేలు కలుగుతుంది. సంతృప్తి కూడా మిగులుతుంది. ఫలితం లేని పనులు, పెద్ద ప్రాధాన్యం లేని వ్యవహారాలలో మునిగితేలితే వ్యక్తులకూ సమాజానికి కూడా నష్టమే. పొదుపు గురించి ప్రతి పైసా జాగ్రత్తగా వినియోగించడం గురించి చెబుతుంటారు గాని వాస్తవంలో ప్రతి నిముషం ఎలా వినియోగించుకోవాలన్నది మరింత కీలకం. ఎందుకంటే డబ్బు ఎలాగోలా సంపాదించుకోవచ్చునేమో గాని పోయిన సమయాన్ని తిరిగి పొందలేము. ఒక చిల్లిని మరమ్మతు చేయించే బదులు రోజూ అలాగే వాడుతుంటే సమయం శ్రమ కూడా దండగ. మీ సమయంపైన ఇతరులకు గౌరవం వుంటుందో లేదో గాని కనీసం మీకైనా వుండాలి. మీకు ఎంత గొప్ప ఆలోచనలున్నా వాటిని సకాలంలో సవ్యంగా అమలు చేస్తేనే ఫలితం. కనక సమయం మిగుల్చుకోవాలి. ఈ కోణం నుంచి గతాన్ని వీక్షించండి. ఏం తేలుతుందో..?



వారికి సరైన సమాధానమిచ్చి ఎవరికీ నష్టం లేకుండా చూసుకోవాలి. వచ్చిన తర్వాత కూడా ఒక పట్టాన వదలకుండా దాడి చేస్తుంటే సూటిగానూ, సున్నితంగానూ సాగనంపాలి. వారి తృప్తి కోసం మీరు వంద సార్లు సర్దుకున్నా కాదన్న ఒకసారి మహాపరాధమైపోతుంది...మీ సమయం మీ చేతుల్లో వుండాలి.మీకు బాగా ఇష్టమైన అవసరమైన పనులకోసం సరైన సమయాన్ని ఎంచుకుని వినియోగించుకోవాలి. మీరు బాగా పనిచేయగలిగే సమయంలో కొంతైనా కుటుంబం కోసం వెచ్చించాలి. లేకుంటే అలసి సొలసి కేవలం సపర్యలు చేయించుకోవడానికి మాత్రమే గృహ ప్రవేశం చేసేట్టయితే మీరు అతిథులుగానే మిగులుతారు.అలాగే కుటుంబానికి సంబంధించిన చిన్న చితక పనులలోనే మునిగితేలుతూ సమాజానికి సంస్థలకు సంబంధించిన కీలకమైన పనులను నిర్లక్ష్యం చేస్తే మీరు స్వార్థపరులై పోతారు. రెంటినీ సమన్వయం చేసుకునే విధంగా సమయ పాలన జరగాలి. నాణ్యమైన సమయాన్ని నాణ్యమైన పనులకు కేటాయించుకోవాలి. అలాగే ఏ పనైనా ఎప్పుడైనా చేయగల నైపుణ్యం సంతరించుకోవాలి.

కాలం ఖాతా...

కాలాన్ని గొప్ప సామ్యవాది. అందరికీ ఒకే విధంగా అందుబాటులో వుంటుంది అంటారు గాని అది పూర్తిగా నిజం కాదు. కొంతమంది పొద్దు పోవడం లేదు అంటే మరికొంత మంది సమయం చాలడం లేదు అంటుంటారు. ఈ రోజుల్లోనైతే బిజీ బిజీ అంటూనే లేజీగా గడిపేవారికి కొదువ లేదు. జీతానికి పని చేసే వారంతా ప్రైమ్‌టైమ్ యాజమాన్యాలకు ధారాదత్తం చేసినట్టే లెక్క. అది గాక మిగిలిన సమయంలోనే విచక్షణగా ఉపయోగించుకోవడం సాధ్యపడుతుంది. కనక ఇలాంటి వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఒకవేళ కార్యాలయాల్లో వత్తిడి లేదని సుత్తి వేసుకుంటూ గడిపేస్తే మరింత నష్టం.అవసరమైన సంగతులయినా పద్ధతి లేకుండా చర్విత చరణంలా మాట్లాడుకుంటూ ప్రయోజనమేముంటుంది?కాని మనకు కార్యాలయాల్లో కాఫీ హోటళ్లలో దమ్మిడికీ పనికి రాని దండగ మాటలతో వృథా చేసే వారు అందరిలోనూ వుంటారు. ఇప్పుడు సెల్‌ఫోన్ వచ్చాకనైతే అరగంట అనవసరమైన మాటలతో గడిపేయడం సర్వసాధారణమై పోయింది. మీకు తెలియకపోయినా మీతో చాటింగ్ చేసేవారు కూడా దొరకుతారు. ఇవన్నీ కాలాన్ని ఖర్చుచేసుకోవడానికి వ్యర్థ మార్గాలు. అలాగాక సార్థకం చేసుకోవడమెలాగన్నది ప్రశ్న. ఉదాహరణకు:టీవీ ముందే గంటల తరబడి కరగించేయవచ్చు. కనక సమయం చాలడం లేదనడానికి కారణమేమిటన్నది తెలియాలంటే ఖాతా పుస్తకాల తనిఖీ (ఆడిటింగ్) లాగా టైమ్ ఆడిటింగ్ చేసుకోవాలి. ఎంత సమయం ఎంత ప్రయోజన కరంగా గడిపాము అనేది విమర్శనాత్మకంగా చూసుకుంటే తెలుస్తుంది. తద్వారా దేనికి ఎంత సమయం అవసరం అన్నది కూడా స్పష్టమవుతుంది. భవిష్యత్తులో ప్రణాళికలు వేసుకోవడం కూడా సులభమవుతుంది.

రైతు రుతువును బట్టి పంట వేసుకున్నట్టే ప్రతివారూ కాల క్రమణికను బట్టి కర్తవ్యాలు రూపొందించుకోవాలి. ఎందుకంటే మనకోసం ఏదీ ఆగదు. మనం కోరుకున్నంత మాత్రాన ఏదీ జరగదు. మనిషి తలుచుకుంటే ఏదైనా చేయవచ్చన్న మాట నిజమే గాని అది నిర్దిష్టమైన కాలమాన పరిస్థితుల్లోనే సాధ్యమవుతుంది. కనక మొదట చేయవలసింది కాలాన్ని సరిగ్గా వినియోగించుకోవడం, కాల గమనాన్ని సవ్యంగా అర్థం చేసుకోవడం.

'వారానికేడు రోజులు మనకి .. రోజుకు ఇరవై నాలుగు గంటలు. వాడుకో మానుకో అంతే జీవితం..' అంటూ రష్యన్ కవి మయకోవస్కీ గొప్ప సత్యాన్ని కవితాత్మకంగా చెప్పాడు.

కొత్త ఏడాది ప్రవేశిస్తున్న ఈ తరుణంలో అంతకుముందు కాలాన్ని కూడా దృష్టితో పెట్టుకుని గడిచి పోతున్న ఏడాదిని పరిశీలించుకుంటే మరింత మెరుగైన నూతన సంవత్సరాన్ని రూపొందించుకోగలుగుతాము. అందుకు ఆట్టే వ్యవధి లేదు గనక వెంటనే రంగంలోకి దిగండి మరి. సకాలంలో చేస్తే సకలం సాధ్యమే.

★

కథ



మట్టిలో మాణిక్యం

"ఈమెకు విటమిన్లు లోపం వలనే తరుచు ఏదో ఒక అనారోగ్యం బారిన పడుతున్నారు. మీకు ఎన్నోసార్లు చెప్పినా మీరు తగుశ్రద్ధ తీసుకోవడంలేదు. ఖరీదైన మందులు కొనేయడానికి సిద్ధపడుతున్నారు కానీ, పౌష్టికాహారం ఆమెకు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.మీకేమైనా అందాలపిచ్చి ఉందా?తింటే ఒళ్లు వస్తుందని? ఇష్టమొచ్చినట్టు బాడీ పెరిగిపోతుందని భయమా?" డాక్టర్ నీరజ ప్రశ్నించింది.

ఆమాటలకు డాక్టర్‌కు ఎదురుగా కూర్చున్న దంపతులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"యస్! నేను మిమ్మల్నే సూటిగా అడుగుతున్నాను. ఈమెకు రక్త లేమి, కాలేయ సమస్యలు,వీటికితోడు జారిపడి కాలిఎముక బెణికింది. భరించలేని నొప్పితో మూడురోజులు ఆసుపత్రిలోనే ఉంది.మీరు ఎంత ఖర్చయినా పర్వాలేదు.ఖరీదైన మందులు వాడమంటున్నారు.తీరా ఈమె క్యారియర్‌లో కేవలం అన్నం,చింతపండు చారు మాత్రమే ఉంటోంది."

దంపతులు ముఖం రంగులు మారాయి.

"ఏమిటి ఫుడ్ విషయంలో ఎందుకలా చేస్తున్నారు? పిసినారుల్లా ఎందుకలా కడుపుకు తినకుండా చారన్నం తింటున్నారు?"

"నీరజగారూ! చింతపండు చారన్నం తప్పితే నాభార్యకు ఏమీ పడవు.వేరేది తిన్నా ఆమెకు కడుపులో వికారం ఆరంభమైపోయి వాంతులవుతాయి. చారన్నం ఎంతతిన్నా ఆమెకు ఏమీకాదు."

"ఎందుకలా జరుగుతోంది. నేను నా సర్వీసులో వినలేదు."

"ఇంతకు మించి ఆయన మీకు చెప్పలేరు. నేను మీకు చెబుతాను. నాఆర్థిక పరిస్థితి వల్ల ఊహ తెలిసినప్పట్నించి మా అమ్మ నాకు చారన్నమే పెట్టింది. ఒక రైస్‌మిల్లులో పనిచేసే నాతల్లికి మిల్లులో నేలపాలయిన నూకలు, రద్దయిన బియ్యం ఆరోజు మిల్లుపనికి ఇచ్చే కూలితో కలిపి ఇచ్చేవారు. ఆరైస్‌ను బాగుచేసి మేమిద్దరం తినేవాళ్లం. మాకున్న పాత పెంకిటింటికి ఆనుకుని ఉన్న పెద్ద చింతచెట్టు ఇచ్చే చింతపండు ఏడాది పొడుగునా చారు తయారీకి పనికివచ్చేది. ఇలా నేను 18ఏళ్లు తిన్నాను. అప్పుడప్పుడు అమ్మ పెంచిన కోడి వండినా నాకు నచ్చక తినేదాన్ని కాను. ఎందుకలా చేశానో నాకు తెలియదు. మొత్తానికి మాకెవరు బంధువులు లేరు. ఎవరింట తినేదిలేదు. నా తిండి చారన్నానికే పరిమితం అయ్యింది" అని చెప్పి కళ్లలో నీళ్లు తిప్పుకుంది సుజాత.

డా॥నీరజ అయోమయంగా చూసి సుజాత చేతివేళ్లను చేతిలోకి తీసుకుని నొక్కిచూసింది. తెల్లగా పాలి ఉన్నాయి. కనురెప్పలు సాగదీసి చూసింది. అక్కడ అలానే పాలిఉంది. యవ్వనంలో ఉన్నందున సుజాత తెల్లని తెలుపుతో అందంగా కన్పిస్తోంది. ఆమె అందమే పెద్ద జీతగాడైన ప్రసాద్‌కు భార్య అయ్యే యోగం కల్పించింది.

"మందులు ద్వారా విటమిన్లు ఎక్కించగలం. కానీ అది అంత మంచి పద్ధతి కాదు. ఏమ్మా మరి మీపాపకు ఇప్పుడు ఐదేళ్లు. ఆపాప అన్నీ తింటుందా?"

"పాప అన్నీ తినగలదు. నేను ఏమీ తినకపోతే తాను తిననంటుంది. దానికి తెలియని వయస్సు. అల్లరి చేస్తే తింటాను. అంతే ఆ రోజంతా మంచం పట్టిపోతాను. ఒక్కటే కడుపు తిప్పి వాంతులవుతాయి. తిన్నది వాంతి అయ్యాకనే తిరిగి మనిషవుతాను. పాపతో నేను తినను. నన్ను చూసి అది తినకుండా నాలా అయిపోతుందని భయం" చెప్పి ఈసారి బావురుమంది.

"వైద్యానికి లొంగని జబ్బు లేదు.మీ సమస్య నాకు ఇదివరలోనే చెప్పి ఉండాల్సింది. ఇప్పటికైనా మించిపోయేదిలేదు. నేను త్వరలో అన్నీ మీతో తినిపిస్తాను. అందుకు నాది పూచి" అని సుజాతకు ఆరోజు డిశ్చార్జి ఇచ్చి పంపేసింది నీరజ.

ఆ దంపతులు వెడుతుంటే నీరజ చేష్టలుడిగి చూసింది.

సెల్‌లో ప్రసాద్‌తో మాట్లాడింది.

"హలో ప్రసాద్‌గారు మీరు సుజాతను ఇంటివద్ద దిగబెట్టేసి ఒకసారి వెనక్కిరండి. మీతో ఆమె గురించి మాట్లాడాలి."

"లేదు మాడమ్. నేను నాభార్యను మరో పెద్దడాక్టర్‌కు చూపించనున్నాను. మీరు ఇందాక ఒకమాట చెప్పారు. ఆమెతో అన్ని రకాలు తినిపిస్తానని అన్నారు.అప్పుడే నేను ఆమెకు ఇక్కడ కాకుండా పెద్దడాక్ట రుకు చూపించి ఎంతఖర్చయినా మీవాక్కు నిజం చేయాలనే నిర్ణయానికి వచ్చేశాను" అని చెప్పి ఫోన్‌పెట్టేశాడు.

డా॥నీరజ సెల్ ఆపేసి సుజాతకోసం ఆలోచిస్తూ కుర్చీలో వెనక్కి వాలింది.

***

ప్రసాద్ తను అపురూపంగా అభిమానించే భార్య సుజాత గురించి ఆరాత్రి బెడ్‌మీద ఆలోచిస్తూ గడిపాడు. ఎలాగైనా ఆమెకున్న అనారోగ్యం నుంచి తేరుకునేలా చేయాలని ఒక పట్టుదల క్షణక్షణం పెరిగిపోయింది. ముందు పాపను ఏదైనా రెసిడెన్సీ కాన్వెంట్‌లో వేసేసి నెలో రెండునెలలో లీవ్ పెట్టుకుని దేశంలో ఎక్కడ ఆమెకు ఆరోగ్యం చక్కబడుతుందో వెతుకుదాం అని గట్టిగా అనుకున్నాడు.అప్పటికే నిద్రపోతున్న భార్యను చూసి ప్రేమగా తల నిమిరాడు.తర్వాత తను నిద్రలోకి జారుకున్నాడు.ఆరోజు అతడు చాలా ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు. అందుకే

హాయిగా నిద్రపోయాడు.

ప్రసాద్ ఉదయాన్నే లేచి నెట్‌లో పెద్దపెద్ద ఆసుపత్రుల్లోని కాలేయ సంబంధ డాక్టర్ల వివరాలు సేకరించాడు. పనిలో పనిగా కేరళలో ప్రకృతి చికిత్సాలయాల గురించి ఆరా తీశాడు.ఆరోజు మరింత ఉత్సాహంగా ఉన్నాడు.

సుజాత నొప్పి ఉన్న కాలు ఈడ్చుకుంటూ పోయి ఒక కప్పులో కాఫీ కలిపి తెచ్చింది.

"ఏయ్ సుజీ! నీకు మంచిరోజులు వచ్చాయి. నేను ఈనెలమీద ఉన్న చికిత్సాలయాలు వెతికిపట్టేశాను. ఇటు అల్లోపతి వైద్యం, అటు ఆయుర్వేద వైద్యంతో నీ తిండి సమస్యకు ఫుల్‌స్టాప్ పెడతాను. అప్పుడు ఇలా ఒక కప్పు కాదు చెరో కప్పు తాగుతూ మంచి విషయాలు మాట్లాడుకోవచ్చు" అని ఆమె కళ్లలోకి సంతృప్తిగా చూశాడు.

"మట్టిలో మాణిక్యం అని నన్ను ఏరికోరి పెళ్లాడి లేనికష్టాలు తెచ్చుకున్నారనే బాధ నాకు ఎక్కువగా ఉంది. మీకు తగినదాన్ని కాలేక పోయాను. నా సమస్య మీకు అనవసరంగా సెలవులు పెట్టిస్తోంది. ఆసుపత్రుల చుట్టూ తిరిగేలా చేస్తోంది. మనకి పెళ్లయి ఐదారేళ్లు అవుతున్నా నా కారణంగా మీరు సుఖంగా లేరు. నా సమస్యతో నిత్యం సతమతమవుతున్నారు" అని కళ్లనీళ్లు తిప్పుకుంది.

"నువ్వు ఏడ్వొద్దు. ధైర్యంగా ఉండు. కేరళలో నీకు తగిన వైద్యం సరైనమందు లభించి తీరుతుంది. అక్కడ ఎలాంటి రోగానికైనా వైద్యం ఉంది. ఆ లేపనాలు అలాంటివి" అని భుజం తట్టాడు.

అక్కణ్నించి ప్రసాద్‌కు అదేపని. భార్యకున్న తిండిలేమిని తరిమి కొట్టి అందరిలా అన్ని తినేలా చేద్దామనే దృఢచిత్తంతో కదిలాడు. అవకాశమున్నమేరకు ఉద్యోగానికి సెలవుపెట్టేసి దేశంలో ఉన్న ఆసుపత్రులకు, ఆయుర్వేద చికిత్సాలయాలకు తిప్పితిప్పి నానారకాల మందులు ఆమెతో తినిపించేసి చివరికి వీసమెత్తు సాధించలేకపోయాడు.

ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టుగా సుజాత పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు, సరికదా ఇప్పుడు మందులు కూడా ఆమెపై తీవ్ర ప్రభావం చూపడంతో మాత్రలు కాకుండా ఇంజక్షన్లతో నరాలు, భుజాలు పుళ్లు అయిపోయాయి. అయినా ఫలితం శూన్యమయ్యింది.

ప్రసాద్ మానసికంగా కృంగిపోయాడు. ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో మిగిలాడు. భార్య చారన్నానికి పరిమితం కావడంతో విలవిలలాడి పోయాడు. ఒకరాత్రి ఆమెను తిప్పిన వైద్యాలయాలు అక్కడ చికిత్స ఫైళ్లు తిరగేసి చూశాడు. ఎందుకో దుఃఖం ముంచుకొచ్చింది.

మంచికి మరోపేరు నా సుజాత. ఏమీ చేయలేని అసమర్థ భర్తను అని కళ్లలో నీళ్లు

తిప్పుకోసాగాడు. ఒక్కసారి భారతదేశంలో పేదలు గుర్తుకువచ్చారు. వారిలో చాలామంది ఇలాంటి తిండితినలేని రోగులే కదూ అనిపించి విలవిలలాడాడు. అందుకే గవర్నమెంటు పేదలకు ముఖ్యంగా గర్భిణీలకు, పిల్లలకు పౌష్టికాహారం పెడుతోందనుకున్నాడు. ఒకప్పుడు ఇంట్లో పనిచేసే నర్సమ్మకు పాలు, పెరుగు, నెయ్యి పడేది కాదంటే పెట్టిపుట్టలేదు అని నానమ్మ అనడం గుర్తుకువచ్చింది.

డాక్టర్ నీరజ గుర్తుకు వచ్చి ఆరాత్రి ఆమెకు ఫోన్ చేశాడు.

ఆమె మెలకువగా ఉన్నందున లైన్‌లోకి వచ్చేసింది. పైగా ఆమె ఆసుపత్రిలోఉంది.

"నేను ప్రసాద్‌ను. మీకు మూడేళ్లుగా కన్పించకుండా నాభార్య సుజాతను తీసుకుని దేశంలో మేటి డాక్టర్లను ఆయుర్వేద ధన్వంతరులకు చూపించాను. వారు చేయాల్సిన వైద్యం చేశారు. వారి చికిత్సలకు కూడా నా భార్యకున్న రోగం పోలేదు. ఏమీ చేయలేని అసమర్థతతో కొట్టుమిట్టాడుతున్నాను. ఆమె బరువు బాగా తగ్గింది.రేపు మీకు తెచ్చి చూపిస్తాను. ఆమె రిపోర్ట్సు మీ ముందు పెడతాను. డాక్టర్ దయచేసి ఏదైనా మార్గముంటే చెప్పండి. ఆనాడు మీరు చెబితేనే దేశమంతా తిప్పాను" ఏకబిగిన చెప్పాడు.

ఆమాటలకు డాక్టరమ్మ అయోమయంలో పడింది.

సుజాతను ఆమె రిపోర్ట్సును తీసుకు రమ్మంది.

ఉదయాన్నే ప్రసాద్ దంపతులు వెళ్లారు.

"కొన్ని టెస్టులు చేయాలి. ఈపూట ఉండండి" అని చెప్పి "ఎందుకు ఇంతగా తగ్గిపోయింది ఈమె" అని ఆశ్చర్యపోయింది.

సుజాతకు పచ్చకామెర్లున్నట్టు రిపోర్టులో తేలిపోయింది.

ప్రసాద్ అయోమయంలో పడ్డాడు.

సుజాతకు ఆరోగం గత రెండునెలలుగా ఉన్నట్టు డాక్టర్ తేల్చింది. ఈమెను ఆసుపత్రిలో పెట్టుకుని చికిత్స చేయాలి.ఎందుకంటే ఈమెకు ఏవీపడవు.తినే చారులో నూనె తాళింపులు ఈమె తినరాదు.పెరుగన్నం తినమంటే ఈమెకు సరిపడదు.కామెర్లు ఎక్కువస్థాయిలో ఉంది అని చెప్పి ఇన్‌పేషెంట్‌గా చేర్చుకున్నారు.

సుజాత వేదాంతిలా నవ్వింది.

"డాక్టర్! నాకు పచ్చకామెర్లు అని నాకుతెలుసు. బయటికి చెప్పలేదు. నాకోసం నాభర్త పడుతున్న శ్రమ మానసికంగా వేదన నన్ను బతకాలనిపించడంలేదు. అందుకే దాచాను. కామెర్లకు చికిత్స లేకుంటే ప్రాణాన్ని హరిస్తాయి" అని విన్నానని భర్త లేనప్పుడు డాక్టర్‌కు చెప్పింది.

"దేనికైనా చావు పరిష్కారం కానే కాదు. మీకున్న సమస్య తీర్చగలనని నాపై నాకు నమ్మకం ఉంది. నాకు అవకాశం ఇవ్వండి" డాక్టర్‌కు ఎలా ధైర్యం చెప్పాలో అర్థంకాక ఇలా చెప్పింది.

"నా రోగం వైద్యశాస్త్రానికి సవాల్ లాంటిది." సుజాత పేలవంగా అంది.

కామెర్లకు మందులు వాడడంలో డాక్టర్ జాగ్రత్తలు పాటిస్తు వారం గడిపింది. కానీ సుజాత కామెర్లు ఒక్కశాతం తగ్గలేదు.సుజాత వంటి కాంప్లికేటెడ్ పేషెంట్ తను ఎన్నడు చూడలేదు. పథ్యంగా ఇవి తినాలి అంటే ఆ తిండి పడదు. మందులు పడవు. మరెలా రోగం తగ్గించేది? అని డాక్టర్‌కూడా తల పట్టుకుంది.

"నాసమస్యకు చావే పరిష్కారం డాక్టర్" అని పలుమార్లు సుజాత అన్నమాటలు గుర్తుకువచ్చి డాక్టర్ విలవిలలాడి పోయింది.

మరోవైపు ప్రసాద్ అన్నిఉండీ నాభార్యను లక్షలు వెచ్చించి కూడా కాపాడుకోలేకపోయిన అసమర్థపు భర్తను అనేమాట డాక్టర్‌కు గుర్తుకువచ్చి ఒక పేషెంటుకు ఏమీచేయలేని తన అసమర్థతపై బాధేసింది. ఏదో చేయాలి. ముందు సుజాతకు కామెర్లు నుంచి తప్పించి అన్నీ తినేలా చేయాలి.అందుకే నెట్‌లో కాలేయ సంబంధిత రోగాలపై కొత్త మందులు కొత్త ఆపరేషన్లు, కొత్త చికిత్సలు, కొత్త రోగాలు గురించి వెతకాలి అని ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆ మరుసటిరోజు వేకువజామున సుజాత తన రోగాల్ని తన బాడీ లోంచి తరిమికొట్టే వైద్యం లేనందున ఆరోగాలకే ఆమె బలి అయిపోయింది. శాశ్వతంగా కన్నుమూసింది.

ప్రసాద్ పదేపదే నిన్ను దక్కించుకోలేని అసమర్థుడను అని రోదించిన తీరుతో డాక్టర్ నీరజ కళ్లనీళ్లు తిప్పుకుంది.

- యర్నాగుల సుధాకరరావు

నోరూరించే పచ్చళ్లు

అల్లం చట్నీ

కావలసిన వస్తువులు

అల్లం : 50 గ్రా॥
బెల్లం : 100గ్రా॥
చింతపండు : 50గ్రా॥
ఎండుమిర్చి: 20
నూనె : అరకప్పు
ఉప్పు : తగినంత

తాలింపు కోసం:

మినపప్పు : 2 టీస్పూన్లు
శనగపప్పు : 2 టీస్పూన్లు
మెంతులు : అర టీ స్పూను
జీలకర్ర : టీస్పూను
కరివేపాకు : కొద్దిగా

తయారుచేసే విధానం

అల్లం శుభ్రంగా కడిగి తొక్కు తీసేసి చిన్నచిన్న ముక్కలుగా కోయాలి. బాణలిలో నూనె వేసి అల్లం ముక్కలు రంగు మారి మంచి వాసన వచ్చేవరకూ వేయించాలి. చింతపండు కడిగి కొద్దిగా నీళ్లలో నానబెట్టాలి. బాణలిలో కొద్దిగా నూనె వేసి ఎండుమిర్చి వేసి వేయించాలి. చల్లారాక ఎండుమిర్చి, చింతపండు, బెల్లం, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. తరువాత అల్లం ముక్కలు కూడా వేసి మెత్తగా రుబ్బాలి. అల్లం వేయించి తీసిన నూనెనే మళ్లీ వేడి చేసి ఒక్క కరివేపాకు తప్ప మిగిలినవన్నీ వేసి తాలింపు చేయాలి. స్టవ్‌మీద నుండి దించాక కరివేపాకు వేసి తాలింపుని చట్నీలో కలపాలి. ఆరిన తరువాత దీన్ని పొడి సీసాలో పెట్టుకుంటే కనీసం ఓ వారం రోజులు నిల్వ ఉంటుంది.

చింతకాయ చట్నీ

కావలసిన వస్తువులు

చింతకాయలు : పావు కిలో, పచ్చిమిర్చి : 75 గ్రాములు
తాజా కొత్తిమీర : 1కట్ట,జీలకర్ర : టీస్పూను
దనియాలు : 2 టీస్పూన్లు, వెల్లుల్లి : 3 రెబ్బలు
అల్లం: చిన్నముక్క, ఉప్పు : తగినంత

తాలింపు కోసం :

ఎండుమిర్చి : 5, జీలకర్ర : అర టీస్పూను
ఆవాలు: అర టీస్పూను, కరివేపాకు : కొద్దిగా
నూనె:2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం :

చింతకాయల్ని బాగా కడిగి ఆరాక, పక్కలనుండే ఈనెల్నీ లోపలున్న గింజల్నీ తీసి ఆరబెట్టాలి. పచ్చిమిర్చి కూడా వేయించాలి. చల్లారాక పచ్చిమిర్చి, వెల్లుల్లి, అల్లం, చింతకాయ ముక్కలు అన్నీ కలిపి మెత్తగా రుబ్బాలి. తరువాత బాణలిలో నూనె వేసి ఎండుమిర్చి, ఆవాలు జీలకర్ర.. అన్నీ వేసి తాలింపు చేసి పచ్చడిలో కలపాలి. (చింతకాయలకు బదులు చింతపండు, పచ్చిమిర్చికి ప్రత్యామ్నాయంగా కారం వేసి కూడా ఈ పచ్చడి చేసుకోవచ్చు)



నువ్వుల చట్నీ

కావలసిన వస్తువులు

నువ్వులు : 150గ్రా, చింతపండు : 50గ్రా
పచ్చిమిర్చి : 8, వెల్లుల్లి : 15 రెబ్బలు,
ఉప్పు : తగినంత

తాలింపు కోసం :

ఎండుమిర్చి : 4, ఆవాలు : టీస్పూను
జీలకర్ర : టీస్పూను
కరివేపాకు : 20 రెమ్మలు
నూనె : 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

చింతపండుని అరకప్పు నీళ్లలో వేసి 15 నిమిషాలు నానబెట్టాలి. గింజలు తీసేసి గుజ్జులా చేసుకోవాలి. బాణలిలో నువ్వులు వేసి బంగారు వర్ణంలోకి మారేవరకూ వేయించాలి. పచ్చిమిర్చిని నేరుగా గ్యాస్ మంట లేదా బొగ్గులమీద కాల్చాలి. కాల్చిన మిర్చి, వేయించిన నువ్వులు, వెల్లుల్లి, ఉప్పు, చింతపండు గుజ్జు అన్నీ కలిపి మెత్తగా రుబ్బాలి. బాణలిలో నూనె వేసి తాలింపుచేసి పచ్చడిలో కలపాలి.

ఇక్కడా.. అక్కడా.. ఉన్నత స్థానమే- ఎలా సాధ్యం?

సత్యశోధన, చెన్నమనేని ఆత్మకథ, వెల : 200/-, ప్రతులకు : చెన్నమనేని రాజేశ్వరరావు, 1141, ఎం.ఎల్.ఏ కాలనీ, రోడ్‌నెం 12, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.



రాష్ట్రంలో సీనియర్ రాజకీయ నాయకులు, శాసనసభ్యునిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావు. భారత కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర నాయకత్వంలో ప్రముఖునిగా ఉంటూ ఆ పార్టీ శాసనసభాపార్టీకి నాయకత్వం వహించారు ఆయన. ఆ తర్వాత తెలుగు దేశం పార్టీలోనూ సమాన గౌరవం పొందారు. చంద్రబాబు ప్రతిపక్షనాయకునిగా ఉన్న సమయంలో ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపాధ్యక్షులుగా ఆయన వ్యవహరించారు. కమ్యూనిస్టుపార్టీ అంటే ఈ వ్యవస్థను సమూలంగా మార్పు చేయడం లక్ష్యంగా పనిచేస్తుంది. దానికి పూర్తి భిన్నంగా ఒక బూర్జువా పార్టీ ఈ వ్యవస్థ పరిధిలోనే ఉంటూ పనిచేస్తుంది. కాని ఈ రెండు పార్టీలలోను సమాన గౌరవం పొందిన విలక్షణ వ్యక్తి రాజేశ్వరరావు. కాని ఇది ఎలా సాధ్యం అయిందన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. ఆ ప్రశ్నకు సమాధానం 'సత్యశోధన' పేరుతో ఇటీవల ఆయన ప్రచురించిన ఆత్మకథలో లభిస్తుంది.

భారత కమ్యూనిస్టుపార్టీని కార్మికవర్గ పార్టీగా పిలవరాదని 1950లలోనే రావి నారాయణరెడ్డితో కలిసి వ్యతిరేకించిన వ్యక్తి రాజేశ్వరరావు. భారత దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి పెట్టుబడిదారుల నాయకత్వంలో జరగాలని కోరుకున్నారు ఆయన. పెట్టుబడిదారీ వ్యవస్థ సంపూర్ణంగా అభివృద్ధి చెందిన తర్వాత మాత్రమే సోషలిజంలోకి పరివర్తన చెందుతుందని విశ్వసించారు. ఇలాంటి విశ్వాసాలతోనే ఆయన అంత కాలం తొలుత ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీలోను, ఆ తర్వాత సిపిఐలోను పనిచేశారు. పలు కీలక బాధ్యతలనూ నిర్వహించారు. ఈ కాలంలో ఎన్నడూ ఆయన వర్గ రాజకీయాలకు, బూర్జువా పార్లమెంటరీ రాజకీయాలకు తేడాను గుర్తించి ఆచరించినట్లు కనిపించదు. ప్రజాసేవ ఏ పార్టీలో ఉండయినా చేయవచ్చునన్నది ఆయన అభిప్రాయం. బహుశా ఆయన దశాబ్దాల పాటు కొనసాగిన పార్టీ కూడ పార్లమెంటరీ రాజకీయాలనే ప్రధానంగా చేసుకోవడం వల్ల కూడ ఇది సాధ్యమయి ఉండవచ్చు. ఇలాంటి భావాలే ఆయన ఒక బూర్జువా పార్టీలో చేరి నిరాటంకంగా పనిచేయడానికి వీలు కల్పించాయి. ఇదే మాదిరి వైఖరి ఆయన కుమారుడు నిర్వహిస్తున్న ఎన్జీవోను ప్రస్తుత వ్యవస్థలో అలాంటి సంస్థల పాత్ర పరిమితులను, స్వభావాన్ని గుర్తించకుండా శ్లాఘించడంలోనూ కనిపిస్తుంది.

ఏదేమయినప్పటికీ ఈ పుస్తకంలో రాజేశ్వరరావు ఎంతో నిజాయితీతో విషయాలను వివరించారని అర్థం అవుతుంది. అందుకు మాత్రం ఆయనను అభినందించాలి. ఈ విధంగా తన ముద్రను ఆత్మకథ రాసే విషయంలోనూ ఆయన కాపాడుకోగలిగారు.

- గుడిపూడి విజయరావు

కొత్త పుస్తకాలు

విలువైన గ్రంథం

తెలుగు భాషా సాహిత్యాలకు అపారమైన దోహదం చేస్తున్న ముస్లిం కవులు, రచయితలు ఎందరో వున్నారు. ముస్లింల మాతృభాష అంటే 'ఉర్దూ' యే అన్న భావనను పరాస్తం చేస్తూ తెలుగు మాతృభాషగా కలవారికన్న అధికంగా తెలుగులో సాహిత్యం వ్యాసంగం సాగిస్తున్న వారున్నారు. 1972లో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైరయిన ప్రముఖ కవి మహ్మద్ జైనుల్ అబేదీన్ ముస్లిం తెలుగు రచయితల సభలు నిర్వర్తించారు. తెలుగు ఇస్లామిక్ అకాడమి కూడా నెలకొల్పారు. తెలుగులో 'గీటురాయి' పత్రిక, తెలుగు ఇస్లామిక్ ప్రచురణల సంస్థ చేస్తున్న కృషి కూడా అసామాన్యమైనది. ముస్లిం కవులు, రచయితల వ్యక్తిగత సాహిత్యం వివరాలతో కూడిన డైరెక్టరీ వంటి గ్రంథం సయ్యద్ నశీర్ అహమ్మద్ కూర్చిన 'అక్షర శిల్పులు. రచయితగా, జర్నలిస్టుగా, చిత్రకారునిగా ప్రసిద్ధులైన నశీర్ చేసిన కృషి ఎంతో విలువైనది. తెలుగు సాహిత్య ప్రపంచంలో ప్రసిద్ధులైన దేవిప్రియ అసలుపేరు షేక్ ఖాజా హుస్సేన్ అనీ, కౌముది అసలు పేరు షంషుద్దీన్ అనీ, అఫ్సర్ అసలుపేరు మహమ్మద్ మహబూబ్ అలీ అని, ఎం.డి. సౌజన్య పేరు నఫీజుద్దీన్ మహమ్మద్ అనీ, సికిందర్ అసలుపేరు యంబి. మొహిద్దీన్ అనీ ఈ పుస్తకం చూస్తేగానీ చాలామందికి తెలిసే అవకాశమే లేదు. మూడువందల ముప్పైమూడు మంది ముస్లిం కవులు, రచయితలు, అనువాదకుల వివరాలను సంతరించుకున్న విలువైన గ్రంథం ఇది. గ్రంథాలు ప్రచురించినవారినే కాకుండా వివిధ పత్రికల్లో, సంకలనాల్లో కొద్దిపాటి రచనలు చేసిన ముస్లింకవులూ, రచయితలనూ కూడా 'అక్షరశిల్పులు'లో చోటు కల్పించడం అభినందనీయం. బహుశా ఇప్పటివరకూ ఇలాంటి సంకలనం ఇదేనేమో!



అక్షరశిల్పులు (ముస్లిం కవులు రచయితల సంక్షిప్త పరిచయం), కూర్పు: సయ్యద్ నశీర్ అహమ్మద్, అజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, శివప్రసాద్ వీధి, కొత్తపేట, వినుకొండ-522647, గుంటూరు జిల్లా. వెల: 150 రూ.

జాతీయతా ధర్మం

దేశభక్తి, (తదితర గేయాలు), గురజాడ, అప్పారావు, ప్రజాశక్తి, బుక్‌హౌస్, మ్హెచ్‌భవన్, ప్లాట్‌నెం. 21/1, వెల: రూ 30/-. ఆజమాబాద్, ఆర్టీసీ కళ్యాణ మంటపం దగ్గర, హైదరాబాద్-20.

'దిద్దుబాటు' తొలి తెలుగు కథానికగా, గురజాడ అప్పారావు రచనగా, కథానిక శతజయంతి ఉత్సవాలు జరిగినంత ఘనంగా అదే 1910 సంవత్సరంలో వెలువడిన గురజాడ వారి 'దేశభక్తిగేయం' గురించి జరగవలసినంత ఆలోచన జరగలేదనే చెప్పాలి. 'నూరేళ్ళ దేశభక్తి' అని డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి సముచితంగా రాసిన ముందుమాటతో నూరేళ్ల ప్రత్యేక ప్రచురణగా గురజాడ అప్పారావు 'దేశభక్తి' తదితర గేయాలను ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించి ఒక జాతీయతా ధర్మాన్ని కూడా నిర్వర్తించిందని చెప్పాలి.

'దేశభక్తి కవిత రాసిన గురజాడను దేశభక్తుడు కాదని సాధించటం చరిత్రను అర్థం చేసుకోలేని ఫలితం! మహోన్నత దేశభక్తుడైన అంబేద్కర్‌నే దేశభక్తుడు కాదన్న మేధావులున్న భారతదేశంలో గురజాడను దేశభక్తుడు కాదనే వాళ్లుండడం సహజమేనేమో!' అన్న రాచపాళెం అని సహజమైనదే. నిజానికి బంకించంద్ర 'వందేమాతరం' కన్న గురజాడ 'దేశభక్తి' గేయం మహోన్నతమైనది. దేశభక్తి అంటే స్వాతంత్ర్యం సంపాదించడంతో సరిపుచ్చుకోవాల్సింది కాదు. అది పౌరుల అభ్యుదయతత్వంగా వుండాలి. సాంఘిక విప్లవం రావాలన్న అంబేద్కర్ భావనలో కూడా అందుకు దోహదం చేసేది. మనుషులను ఏకత్రితం చేసే దేశభక్తి భావనయే! 'వొట్టిమాటలు కట్టిపెట్టోయ్! గట్టిమేల్ తలపెట్టవోయి' అని గురజాడ ఇచ్చిన ప్రబోధం నేతలు పెడచెవిన పెడుతున్న చేటుకాలం దాపురించింది. 'స్వత లాభం కొంత మానుకు' అని తనకు మాలిన ధర్మం వద్దని గురజాడ సూచించాడన్న దేశంలో ఇవాళ అవినీతియే విరాట్రూపం దాల్చింది. నరుల చెమటను తడిసి మూలం ధనంపంటలు పండవలనోయ్' అని శ్రమశక్తితో ఆర్జించి ఆర్థికంగా సుఖించమన్న ఆయన మాటకు పెడార్థాలు తీసి అవతలి వాడి శ్రమతో తాను సుఖించే అవినీతి, అక్రమాలు విస్తరించాయి. గురజాడ దేశభక్తి కవిత అసలు సిసలు స్ఫూర్తిని నూరేళ్ల తరువాత ఇప్పటికైనా సమాజం మూలమూలల్లోకి చొప్పించగలిగితే బాగుంటుందేమో!

- సుధామ

సింహం బోను

బుజ్జాయిలూ మీరు ఎప్పుడైనా జూకెళ్లారా! లేదా? వెళ్లామని కొందరు... వెళ్లలేదని ఇంకొందరు అంటున్నారు. సర్సరి. ఇవాళ మీకు 'సింహం బోను' బొమ్మ చేయడం ఎలాగో చెప్దామనుకొంటున్నాం. మరి రెడీనా!

ఏమేం కావాలంటే...

తెల్ల చార్టు
కత్తెర
ఫెవికాల్
షూ బాక్స్
పెన్సిల్
ఆకుపచ్చ
పసుపు
ఇటుకరాయిరంగు స్కెచ్ పెన్నులు
రబ్బరు.

ఎలా చేయాలంటే...



చేసేద్దాం



ముందుగా షూ బాక్స్ పని చూద్దాం. దీన్నే మనం బోనులాగా తయారుచేయాలన్నమాట. ముందు పెట్టె పై భాగాన్ని కత్తిరించి తీసేద్దాం. ఇప్పుడు చూడ్డానికి ఇది మూత లేని డబ్బా లాగా వుంటుంది. దీన్ని మనం బోనులాగా తయారుచేయాలి. ఎలాగంటే చార్టు తీసుకొని అట్టపెట్టెకు సరిపడా సన్నటి పీసుల్లాగా కత్తిరించండి. వీటితోనే మనం బోను చువ్వలు తయారుచేస్తాం.

ఇప్పుడు సింహం బొమ్మ కావాలి. ఇదిగో బొమ్మలోలాగా చార్టుమీద గీసుకొని కత్తిరించుకోండి. దీన్ని ఇప్పుడు రంగులతో నింపేయండి. చూడ్డానికి నిజమైన సింహం లాగా కనిపించాలి సుమా. ఇప్పుడు మనం దీన్ని షూబాక్స్ లోపల అతికించాలి. ఇప్పుడు స్కెచ్ పెన్నుతో బోనుకు రెండు వైపులా చెట్ల మాదిరిగా గీయాలి. తర్వాత ఇందాక మనం కత్తిరించుకున్న సన్నటి చార్టు పీసులను అట్టపెట్టె పైన అతికించాలి. ఇవే బోను చువ్వలన్నమాట. అంతే సింహం బోను రెడీ. చూశారుగా. దీన్ని మీ టేబుల్ మీదో, షోకేసులోనే పెడితే సూపర్. మీ నేస్తాలు దడుచుకున్నా ఆశ్చర్యంలేదు.

ఏమేం వున్నాయి?

హాయ్ నేస్తాలూ... ఇదిగో ఇక్కడో విచిత్రమైన ప్రాణి వుందికదా. అందులో రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం



జవాబు: ball, lion, nest, tower, rat, tin, nine.

పూరించండి

చిన్నారులూ... ఇక్కడ కొన్ని బొమ్మలున్నాయికదా. వాటిని ఆంగ్లంలో ఏమంటారో తెల్సుగా. మరి ఆ పదాలను ఈ గళ్లలో పూరించండి.

నేర్చుకుందాం



ఎవరెవరున్నారు?



నేస్తాలూ...ఈ బొమ్మలో ఎవరెవరున్నారో చెప్పుకోండి? బోలెడన్ని జీవులు కనిపిస్తున్నాయా? మరి మనిషి కనిపించలేదా? అయితే పరిశీలనగా చూసి ఏమేం పక్షులు, జంతువులున్నాయో వరసగా రాయండే.

పది తేడాలేవోచ్

ఈ బొమ్మలు రెండూ చూడ్డానికి ఒకేలా వున్నాయా? కానీ పది తేడాలున్నాయర్రా. మరి అవేంటో కనిపెట్టి చెప్పండి.





చిటారుకొమ్మను చేరేదెలా

మాటల కోట - 32

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1		■	2		■	3		■
	■			■	5		■	6
■	7		■	8		■	9	
10		■	11		■	12		■
	■	13		■	14		■	15
■	16		■	17		■	18	
19		■	20		■	21		■
	■	22		■	23		■	24
■	25		■	26		■	27	

అడ్డం :

1. పాఠశాలకు పల్లె మాట (2)
2. వారానికొకసారి ఏర్పాటు చేసే పాత కాలపు అంగళ్లు
3. వస్త్రమే, కొన్ని పత్రికలు వినియోగించని జనం మాట (2)
4. నీటిలో పెరిగే తీగ, నోటిలోనూ ఇది పడుతుందంటారు (2)
5. నగరవాసుల నోట బియ్యం చెట్టు (2)
7. దారమే. ఇది లేకుండా వస్త్రాల నేత కుదరదు (2)
8. దిబ్బ కన్నా పెద్దది. కొండకన్నా చిన్నది (2)
9. మహా గొప్పది (2)
10. ప్రవహించు వాడుకలో (2)
11. కోరిక (2)
12. సభ, సమూహం, గుత్తేదార్లు కుమ్మక్కవటాన్ని ఇలా రాస్తున్నారిప్పుడు (2)
13. దారి మార్చిన దగ్గర, దాచుకోవటం (2)
14. కోసిన పంట పోగు, ఇటీవల వానల్లో ఈ రూపాన ఉన్న వరి నీటిపాలయింది (2)
16. గట్టు, సమీపం (2)
17. పాలు విరిగితే వచ్చేది ఇదే (2)
18. తర్వాత, అనంతరం (2)
19. పోరాటమే, యుద్ధం (2)
20. ఇనుప కడ్డీ, నాగలి ములుకు (2)
21. పాత కొలతల్లో జాన తర్వాత. బార కంటే తక్కువ. మధ్య వేలి ప్రారంభం నుంచి మోచేతి చిప్ప చివర వరకూ కొలత (2)
22. ఒక చోట నివశించే వ్యక్తి, రాశి కాదు ఇది ముఖ్యమంటారు (2)
23. చిన్న ముక్కలు, రవ్వ (2)
25. బుడుగులు తొడిగే బట్ట. లాక్కోమని కోరటం (2)
26. చిన్న కుప్ప (2)
27. గాన సాహిత్యం, ఆటకు తోడు (2)

నిలువు :

1. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు విశ్రాంతి వసతి (2)
2. వస్తువుల మోతకు వినియోగించేది, బజారుకు వెళ్తే ఇది తప్పనిసరి (2)
3. లక్ష్యం (2)
4. ఇది సంపూర్ణ ఆహారమంటారు. వీటిని తల్లి బిడ్డలకు తాగిస్తే జీవితాంతమూ రోగ నిరోధానికి ఉపకరిస్తుందని వైద్యులంటారు (2)
5. రంగు, సౌందర్యం (2)
6. నువ్వు, నేనూ కలిస్తే (2)
7. వంద మరోలా (2)
8. దిక్కు, దశకు తోడు (2)
9. కుండ (2)
10. చిన్న పిల్ల (2)
11. పొదుపు వ్యవహారికం (2)
12. చిన్న పిల్ల, పిల్లి పిల్లను ఇలా పిలుస్తారు (2)
13. పట్టణం, నగరం (2)
14. శిస్తు, దంతం (2)
15. చలికాలంలో వణికించేది, దీన్ని పులితో కలిపి చెబుతారు (2)
16. వలె, మాదిరి, ఇలా, రీతి, విధం (2)
17. తాగు, సేవించు (2)
18. యంత్రం (2)
19. వెళ్లమని రెండుసార్లు చెప్పండి (2)
20. కోపం, కక్ష (2)
21. గుంపు (2)
22. వంకకు తోడు, ప్రధానంగా వర్షాకాలంలో ప్రవహించే చిన్న నదులు (2)
23. ఆకులు, తీగలపై మొలిచే అతి చిన్నవైన ముళ్లు / పొడి (2)
24. పాటకు తోడు, క్రీడ (2)

మాటలకోట - 31 జవాబు

1 నీ	రు	■	2 మి	స్స	3 మ్మ	■	4 నే	5 త
చు	■	6 క	ను	■	7 మ్మ	క	■	ప్ప
■	8 శి	■	9 ము	10 దం	అ	■	11 చే	■
12 అ	ల	13 తి	■	మం	■	14 ము	దు	15 రు
ర్థ	■	16 ప్ప	మొ	■	17 రే	ఖ	■	జు
18 త	19 ప్పు	లు	■	గా	■	21 ము	22 రు	వు
■	ప	■	23 క	బు	24 రు	■	క్కు	■
25 గ	■	26 మూ	ల	■	27 మా	పు	■	28 పా
29 ని	న్న	■	30 త	పు	లు	■	31 వ్రా	త

పాండు పగటి కల

చిన్నమ్మకు ఒక్కగానొక్క కుమారుడు పాండు. వాడు ఒట్టి సోమరిపోతు. పనే చేయడు. పగటికలలు కనడంలోనే వాడికి సరిపోతుంది. పాండు పుట్టిన కొద్ది రోజులకే పాము కరిచి అతగాడి తండ్రి చనిపోతాడు. దాంతో పాండు పోషణ అంతా తల్లే చూసుకొనేది. వెనకా ముందూ ఆస్తిపాస్తులేం లేవు కనుక రెక్కలే ఆధారం. వుండేకొద్దీ వయసు పైబడుతుందేకానీ తరగదుగా. చిన్నమ్మ పరిస్థితి అదే. తన ఒంట్లో శక్తి సన్నగిల్లుతున్నా... కొడుకులో ఏ మార్పు లేదు. ఎంతసేపూ తను తెచ్చి పెడితే తిని తిరగడం తప్ప మరో ఆలోచన లేదు. ఏదైనా పని వెతుక్కోమని ఎన్నోసార్లు చెప్పినా వినిపించుకోడు పాండు. అలా అయితే లాభం లేదనుకొని ఓసారి ఊరి పెద్ద దగ్గరకు పాండును తీసుకెళ్లి చెప్పిస్తుంది.

"ఒరే పాండూ! మీ అమ్మకా వయసైపోయింది. నువ్వా ఖాళీగా తిని తిరుగుతావు. ఇలా అయితే నిన్ను ఆమె మాత్రం ఎంతకాలం మేపుతుందిరా. సరే కన్న నేరానికి ఎలాగోలా చచ్చేదాకా తిండిపెడుతుంది. ఆ తర్వాత నీ గతేమిటిరా? పైగా ఎల్లకాలం ఇలా ఒంటి కొమ్ము సొంటి లాగా వుండిపోతావా? పెళ్లి చేసుకోవూ...! ఏదైనా పని చేసి నాలుగు డబ్బులు సంపాదిస్తేనే కదరా నీకు ఎవరైనా పిల్లనిస్తారు. శుభ్రంగా ఏదైనా పనిలో చేరు. పెళ్లి చేసుకొని పిల్లా పాపలతో సుఖపడు. మీ అమ్మను సంతోషపెట్టు..." అని చెప్తాడు ఊరి పెద్ద.

దానికి పాండు సంతోషంగా తల ఊపుతాడు. అలాగే చేస్తానని నమ్మకంగా మాటిస్తాడు. ఆ క్షణం నుంచి పని వేటలో పడతాడు. ఓసారి అలా వీధిలో నడుస్తుండగా ఓ వ్యక్తి కనిపిస్తాడు. అతని నెత్తి మీద కోడిగుడ్ల బుట్ట వుంటుంది. ఎంత దూరం నుంచి మోసుకొస్తున్నాడో ఏమో చెమటలు కారిపోతున్నాయి అతగాడికి. పాండును చూడగానే అతని మోము సంతోషంతో విరుస్తుంది.

"నీకు పుణ్యముంటుందిగానీ...ఏమోయ్! నాకు ఓ పని చేసిపెడతావా?" అనడుగుతాడు.

"ఓస్..పనేకదా. నేనూ దానికోసమే వెతుకుతున్నాను. చెప్పండి" అంటాడు పాండు సంతోషంగా.

"మరేంలేదు. నేను చాలా దూరం నుంచి గుడ్ల బుట్ట మోసీ మోసీ అలసిపోయాను. మా ఇంటిదాకా ఈ బుట్ట తెచ్చిపెడితే నీకు రెండు గుడ్లు ఇస్తాను" అంటాడు.

పాండు సంతోషంగా ఆ బుట్ట తీసుకొని నెత్తిమీద పెట్టుకొని అతగాడి ఇంటి దారి పడతాడు. అయితే మనవాడికి పగటికలలు కనే అలవాటు బాగా వుందికదా. వెంటనే ఊహల్లోకి వెళ్లిపోతాడు.

"ఆహా నాకు ఇతను రెండు కోడిగుడ్లు ఇస్తాడు. అవి పిల్లలవుతాయి. అవి కోళ్లవుతాయి. అవి రోజూ గుడ్లు పెడతాయి. అవి మళ్లీ పిల్లలై... పెద్దవౌతాయి. మళ్లీ గుడ్లు పెడతాయి. మళ్లీ పిల్లలై...కోళ్లవుతాయి. మళ్లీ గుడ్లు పెడతాయి. నాకు బోలెడంత డబ్బు వస్తుంది. వాటితో మంచి ఇల్లు కొంటాను. ప్రపంచంలోకెల్లా అందమైన అమ్మాయిని భార్యగా చేసుకొంటాను. ఇంటినిండా పనివాళ్లుంటారు. నా తల్లి, భార్య మహారాణుల్లా కాలుమీద కాలు వేసుకొని కూర్చుంటే పనివాళ్లే అంతా చేసేస్తుంటారు. నేను మిద్దె మీదకెళ్లి రంగురంగుల అందమైన గాలిపటం ఎగరేస్తాను. అది చూడ్డానికి ఊరిజనమంతా తండోపతండాలుగా వస్తారు...నేను గాలిపటాన్ని ఇలా ఎగరేస్తాను..." అనుకొంటూ చేతులు గాలిలోకి పైకెత్తుతాడు. అంతే.

కోడిగుడ్ల బుట్ట కిందపడిపోతుంది. గుడ్లన్నీ పగిలిపోయి చెల్లాచెదురై పెంకులౌతాయి. అంతే... ఆ వ్యక్తికి విపరీతమైన కోపం వచ్చి

"ఏమయ్యా...నాకు వెయ్యిరూపాయల నష్టం తెచ్చిపెట్టావే..." అని తిట్టి...ఏడవసాగాడు.

"ఏమయ్యోయ్. నీకు వెయ్యి రూపాయలే నష్టం. నాకు ఎంత నష్టమొచ్చిందో చెప్పలేను తెల్సా..." అని మొత్తం లెక్కగట్టడంలో లీనమైపోతాడు.

ఇదంతా చూస్తున్న గ్రామస్తులు బుట్ట యజమానిని చూచి నవ్వుతూ...'నీకు పని చెప్పడానికి ఈ పగటికలల పాండు గాడే దొరికాడా" అంటారు వ్యంగ్యంగా.

-చూటీ



ఏం కట్టడాలు!

'ఏంటీ...ఇవి కట్టడాలా! చూడ్డానికి అలా లేవే! నత్త, బుట్ట, పుస్తకాలు, తిరగబడిన ఇళ్లు... లాగున్నాయే' అంటరా! మరదేనండీ సృజనాత్మకత అంటే. ఈ నిర్మాణాలను బట్టే సృష్టికర్తల మనసులను అర్థంచేసుకోవాలి. ఉదాహరణకు కింద వరుసలో పుస్తకాలను ఒక క్రమంలో పొందిగ్గా సర్దినట్టున్నాయా? అది లైబ్రరీ. గ్రంథాలయాన్ని మామూలుగా కట్టేస్తే ఏం బావుంటుందనుకొన్నారో ఏమో! ఇలా ఈ ఆకారంలో నిర్మించారు. ఇదే కాదు... ఇక్కడ కనిపిస్తున్న కట్టడాలన్నీ అంతే... బయటికి చూడ్డానికి గానీ...లోపల గానీ...అంతా ప్రత్యేకంగా వుంటాయి. 'మరీ విచిత్రం కాకపోతే...ఆ తిరగబడిన ఇళ్లు కూడా అలాంటివేనా!' అనుకోవచ్చు. అంతేనండీ. చూడ్డానికి ఏ భూకంపానికో తిరగబడిన ఇళ్లలాగున్నా... లోపల మామూలుగానే వుంటాయట. అందుకేనండీ జిహ్వకో రుచి అన్నారు పెద్దలు. ఇవీ అంతే.